# నేటి నిజం

తెలుగు దినపత్రిక

E-mail : netinijam93@gmail.com

website:www.netinijam.com


## పసికందును వదిలేసిన పేరెంట్స్.. ప్రాణాలు కాపాడిన ఎస్ఐ

హైదరాబాద్, డిసెంబర్ 18:అప్పుడే పుట్టిన పసికందును అపార్ట్‌మెంట్ ఆవరణలో వదిలేసి వెళ్లిపోయారు తల్లిదండ్రులు. సమాచారం అందుకున్న ఎస్ఐ ఘటనాస్థలికి చేరుకుని ఆ పసిపాప ప్రాణాలు కాపాడారు. ఈ ఘటన కుషాయిగూడ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.

వివరాల్లోకి వెళ్తే.. కుషాయిగూడ పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో అప్పుడే పుట్టిన పసిబిడ్డను తల్లిదండ్రులు వదిలేసి వెళ్లిపోయారు. పసిపాప ఏడుపు విన్న స్థానికులు అప్రమత్తమై పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ సాయికుమార్ తన బృందంతో ఆ అపార్ట్‌మెంట్ వద్దకు చేరుకున్నారు. శిశువును చూసి చలించిపోయారు. 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అనంతరం శిశువును ఎస్ఐ సాయికుమారే.. 108 అంబులెన్స్‌లో సమీప ఆస్పత్రికి తరలించారు. పాపకు డాక్టర్ల పర్యవేక్షణలో వైద్యం కొనసాగుతోంది. ఆ శిశువు తల్లిదండ్రుల కోసం పోలీసులు సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.


హైదరాబాద్ సోమవారం 19-12-2022 | RNI No.52865/93-Postal No\.H/SD/258/2021-2023 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :29 | సంచిక: 103 | పేజీలు:6 | వెల: రూ.1/-


## డిప్యూటీ కలెక్టర్ జ్యోతి సురేఖకు డా.లక్ష్మీకాంతం అభినందనలు



హైదరాబాద్, డిసెంబర్ 18: స్పోర్ట్స్ కోటాలో డిప్యూటీ కలెక్టర్ గా నియమితులైన జ్యోతి సురేఖను విశ్రాంత ఐఏఎస్ అధికారి, టీటీడీ మాజీ జేఈవో, పూర్వ కృష్ణా జిల్లా కలెక్టర్ డా.బీ.లక్ష్మీకాంతం అభినందించారు. ఈ సందర్భంగా విజయవాడలోని నోవాటెల్ వేదికగా జరిగిన అభినందన సభలో ఆయన పూలబొకే, శాలువతో ఆమెను సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అర్జున అవార్డు గ్రహీతగా, ప్రపంచ ఛాంపియన్ షిప్ ఆర్చరీ విభాగంలో 3 పతకాలు సాధించిన జ్యోతి సురేఖ అకుంఠిత దీక్షకు, పట్టుదలకు నిదర్శనంగా నిలిచారని కొనియాడారు. అమ్మాయిల్లో ఆణిముత్యంగా, భావితరాలకు మార్గదర్శిగా జ్యోతి సురేఖ నిలిచారని అభినందించారు. నిరంతర శ్రమతోనే ఆమె, డిప్యూటీ కలెక్టర్ గా నియమితులయ్యారని, ఆ పదవికి వన్నె తేవడంతో పాటు, ప్రజల ఆకాంక్షలు, సమస్యల పరిష్కారానికి మార్గదర్శిగా నిలవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పథకాల గ్రౌండింగ్ లోనూ లబ్ధిదారులకు వాటిని చేరవేయడంలోనూ డిప్యూటీ కలెక్టర్ గా తన బాధ్యతలను సక్రమంగా నెరవేర్చి, మహోన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జ్యోతి సురేఖ మాట్లాడుతూ డా.లక్ష్మీకాంతం లాంటి పెద్దల ఆశీర్వాదం, సూచనలను తప్పకుండా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

## రాచకొండ కమిషనరేట్‌కు కొత్త బాస్ కమలహాసన్ రెడ్డి?



హైదరాబాద్ డిసెంబర్ 18 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తెలంగాణ రాష్ట్ర డీజీపీగా ఉన్న మహేందర్ రెడ్డి ఈ నెలాఖరులో రిటైర్మెంట్ కానుండటం.. కొత్త డీజీపీకి సంబంధించిన ప్రక్రియ షురూ కావటం తెలిసిందే. దీనికి సంబంధించి ఇప్పటికే భారీ చర్చ నడుస్తోంది. పోటీ మొత్తం హైదరాబాద్ సీపీ ఆనంద్ వర్సస్ తెలంగాణ ఏసీబీ చీఫ్ గా వ్యవహరిస్తున్న అంజనీ కుమార్ మధ్యే ఉన్నట్లుగా చెబుతున్నారు. దీనికి సంబంధించి చర్చ పెద్ద ఎత్తున జరుగుతున్నా.. తుది నిర్ణయం ఏ రీతిలో ఉంటుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. అదే సమయంలో సుదీర్ఘకాలంగా రాచకొండ సీపీగా వ్యవహరిస్తున్న మహేశ్ మురళీధర్ భగవత్ బదిలీ కానున్నట్లుగా చెబుతున్నారు.దేశంలోనే అతి పెద్ద కమిషనరేట్ అయిన ఢిల్లీ కమిషనరేట్ తర్వాత విస్తీర్ణంలో పెద్దదిగా చెప్పే సైబరాబాద్ కమిషనరేట్ ను రెండు ముక్కలు చేసి.. అందులో ఒక ముక్కకు రాచకొండ కమిషనరేట్ గా నామకరణం చేయటం తెలిసిందే. రాచకొండ కమిషనరేట్ ఏర్పాటు నుంచి ఇప్పటివరకు మహేశ్ భగవత్ సీపీగా కొనసాగటం ఒక రికార్డుగా చెప్పొచ్చు. అంతేకాదు.. ఒక సీపీగా అత్యధిక సంవత్సరాలు ఒకేచోట పోస్టింగ్ నిర్వహించిన అధికారిగా ఆయన్నే చెప్పాలి. ఈ ఏడాది డీజీపీ మార్పు నేపథ్యంలో ఆయనకు స్థానచలనం తప్పదనే మాట వినిపిస్తోంది.తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం రాచకొండ కమిషనరేట్ కు కొత్త బాస్ రానున్నట్లుగా చెబుతున్నారు. మహేశ్ భగవత్ స్థానంలో 2004 బ్యాచ్ కు చెందిన కమలహాసన్ రెడ్డిని నియమిస్తున్నట్లుగా చెబుతున్నారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్.. నిజామాబాద్ రేంజ్ ఇన్ చార్జి డీఐజీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన్ను రాచకొండ సీపీగా నియమిస్తున్న ఉత్తర్వులు జారీ అవుతాయని భావిస్తున్నారు.ఇటీవల హుజురాబాద్ ఉప ఎన్నిక నేపథ్యంలో కరీంనగర్ పోలీసు కమిషనర్ గా ఉన్న కమలాహాసన్ రెడ్డిని బదిలీ చేసి డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేయటం.. తర్వాత హైదరాబాద్ – నిజామాబాద్ రేంజ్ ఇంచార్జీ డీఐజీగా తాత్కాలిక పోస్టు ఇవ్వటం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయనకు గౌరవ ప్రదమైన పోస్టు ఇవ్వాలన్న ఉద్దేశంతో ఆగారని చెబుతున్నారు. డీజీపీ మార్పు నేపథ్యంలో ఒక్కసారిగా భారీ మార్పులు చేర్పులు చోటు చేసుకోనున్నట్లుగా చెబుతున్నారు.రాచకొండ సీపీగా కమలహాసన్ రెడ్డిని ఎంపిక చేసి.. ఆయన స్థానంలో ఉన్న మహేశ్ భగవత్ ను ఏసీబీ డైరెక్టర్ గా నియమిస్తే.. అంజనీ కుమార్ డీజీపీ కావటం ఖాయమని చెప్పాలి. అందుకు భిన్నంగా కమల్ హాసన్ రెడ్డిని రాచకొండ సీపీగా.. మహేశ్ భగవత్ ను హైదరాబాద్ సీపీగా నియమిస్తే.. ప్రస్తుతం హైదరాబాద్ కు సీపీగా వ్యవహరిస్తున్న సీవీ ఆనంద్ డీజీపీ అయ్యే వీలు ఉంటుంది. మొత్తంగా రాచకొండ సీపీగా కమల్ హాసన్ రెడ్డి ఖాయమన్న మాట వినిపిస్తోంది. మరేం జరుగుతుందో ఈ నెలాఖరుకు తేలిపోనుంది.

### చరిత్రలో నేటినిజం



కం॥ ఉరుతర ప్రజ్ఞా మూర్తిని
గురుతర వాస్స్వాము నాసంగు కోమల వాపదయున్
వెరపెరుగని ధీశాలిని
కరుణాత్ముని విదుని ఓంప్రకాశు నిదలతుమున్ !!

(డిసెంబర్ 19 నటుడు ఓంప్రకాష్ జయంతి..)



–రాధశ్రీ
సెల్:9494481210

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

## రాష్ట్రంలోని అన్ని దేవాలయాలను అభివృద్ధి: మంత్రి హరీశ్‌రావు



సిద్దిపేట డిసెంబర్ 18 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : రాష్ట్రంలోని అన్ని దేవాలయాలను అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు తెలిపారు. సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జున స్వామి కల్యాణోత్సవంలో మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, మల్లారెడ్డి, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. కొమురవెల్లి మల్లన్న స్వామికి ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలతో పాటు రూ. కోటి విలువైన బంగారు కిరీటాన్ని మంత్రి హరీశ్‌రావు సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. కొమురవెల్లి మల్లన్న మన కొంగు బంగారమని, రాష్ట్రానికే తలమానికం మల్లన్న జాతర అని పేర్కొన్నారు. ఇవాళ మల్లన్న స్వామివారి కల్యాణం వైభవంగా జరగడం, స్వామివారికి బంగారు కిరీట ధారణ చేయడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ ఆలయాలకు నిధులు మంజూరు చేస్తూ.. పురాతన ఆలయాలకు పూర్వ వైభవం తెస్తున్నారని మంత్రి వెల్లడించారు.కొమురవెల్లి మల్లన్న ఆలయ అభివృద్ధికై రూ. 30 కోట్లు కేటాయించారని గుర్తు చేశారు. ఇప్పటికే సీఎం కేసీఆర్ మల్లన్న స్వామివారిని రెండుసార్లు దర్శించుకున్నారు. వచ్చే ఏడాది మల్లన్న స్వామి కల్యాణం వరకు కేతమ్మ, మేడమ్మల అమ్మవార్లకు ఒక కిలో స్వర్ణ కిరీటం తయారు చేయిస్తామని మంత్రి ప్రకటించారు. కొందరు ఎన్ని కుట్రలు చేసిన మల్లన్న దయతో మల్లన్న సాగర్ అనుకున్న సమయానికి పూర్తి చేసుకున్నాం. మల్లన్న దేవుడి దయతో, సీఎం కేసీఆర్ కృషితో మూడేళ్లలో మల్లన్న సాగర్ పూర్తి చేసుకుని పలు జిల్లాలకు సాగునీటితో సస్యశ్యామలం చేయడం జరుగుతున్నదని తెలిపారు. మల్లన్న సాగర్ ప్రారంభం చేసి గోదావరి జలలతో సీఎం కేసీఆర్ మల్లన్న పాదాలు కడిగి మొక్కులు తీర్చుకున్నారని హరీశ్ రావు తెలిపారు.

## మేఘాలయ.. త్రిపుర రాష్ట్రాల్లో పర్యటించిన మోడీ.. ఎన్ఈసీ సహకారాన్ని ప్రశంసించిన ప్రధాని



న్యూఢిల్లీ, డిసెంబర్ 18:ప్రధాని నరేంద్ర మోడీ నేడు మేఘాలయ..త్రిపుర రాష్ట్రాల్లో పర్యటించారు. ముందుగా మేఘాలయా రాష్ట్రంలో ఆయన పర్యటించారు. అక్కడి నుండి త్రిపుర టూర్ కి వెళ్లారు. మేఘాలయ టూర్ లో తొలుత షిల్లాంగ్ లో జరిగి న ఈశాన్య మండలి సమావేశంలో ప్రధానమంత్రి మోడీ పాల్గొన్నారు. 1972లో నార్త్ ఈస్టర్న్ కౌన్సిల్ ను ప్రారంభించారు. ఎన్ ఈ సీ సమావేశంలో మోడీ ప్రసంగించారు. ఈశాన్య రాష్ట్రాల్లో గత ఎనిమిదేళ్లుగా అనేక అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించినట్టుగా మోడీ చెప్పారు. ఈశాన్య ప్రాంతాల అభివృద్ధిలో ఎన్ఈసీ సహకారాన్ని ప్రధాని మోడీ ప్రశంసించారు.

ఎన్ఈసీ స్వర్ణోత్సవ వేడుకలు ఆజాదీకా అమృత్ మహోత్సవ్ తో సమానంగా జరుగుతున్నాయని ప్రధానమంత్రి చెప్పారు. ఈశాన్య ప్రాంతంలోని ఎనిమిది రాష్ట్రాలను అష్టలక్ష్మిగా పేర్కొన్నారు. ఎనిమిది అంశాలపై ఈ రాష్ట్రాల్లో అభివృద్ధికి పనిచేస్తున్నామన్నారు. శాంతి, శక్తి, పర్యాటకం, 5 జీ కనెక్టివిటీ, సంస్కృతి, సహజ వ్యవసాయం, క్రీడలు, సంభావ్యతపై కేంద్రీకరించిన పనిచేస్తున్నట్టుగా మోడీ చెప్పారు. ఆగ్నేయ ఆసియాకు ఈశాన్య ప్రాంతం ముఖద్వారమని ఆయన చెప్పారు. మయన్మార్ –థాయ్ లాండ్ ట్రైలేటరల్ హైవే, అగర్తలా–అఖౌరా రైలు ప్రాజెక్టు పనులు ఈ ప్రాంతంలో నిర్వహిస్తున్నట్టుగా ప్రధాని తెలిపారు. తూర్పు ప్రాంతంలో అభివృద్ధి కార్యక్రమాలు విస్తరిస్తున్నట్టుగా చెప్పారు. ఈశాన్య రాష్ట్రాల్లో చోటు చేసుకున్న ఒప్పందాలతో తీవ్రవాద కేసులు గణనీయంగా తగ్గాయని గుర్తు చేశారు. సహజ వ్యవసాయం గురించి నొక్కి చెప్పారు. ఈ వ్యవసాయానికి ఈశాన్య రాష్ట్రాలు దోహదపడతాయని ప్రధాని చెప్పారు. ఈశాన్య ప్రాంతంలో క్రీడా విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి చేయడం ద్వారా క్రీడాకారులకు తోడ్పాటు అందిస్తున్నట్టు చెప్పారు. ఈశాన్య రాష్ట్రాలు జలవిద్యుత్ పవర్ హౌస్ గా మారగలవని ప్రధాని మోడీ అభిప్రాయపడ్డారు. దీంతో ఈ ప్రాంతంలోని రాష్ట్రాలు మిగులు విద్యుత్ రాష్ట్రాలుగా మారుతాయన్నారు. దీంతో పరిశ్రమల విస్తరణకు దోహదపడుతుందని పీఎం చెప్పారు. పరిశ్రమల ఏర్పాటుతో స్థానికులకు ఉపాధి లభ్యం కానుందన్నారు. ఈశాన్య రాష్ట్రాలు పర్యాటకులను ఆకర్షిస్తుందని ఆయన చెప్పారు. ఈ రాష్ట్రాల్లో టూరిజం సర్క్యూట్ ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. దశాబ్దాలుగా ఈ ప్రాంతంలో కనెక్టివిటిని పెంచే ప్రాజెక్టులు పెండింగ్ లో ఉన్నాయని ప్రధాని మోడీ చెప్పారు.

అయితే ఇటీవల కాలంలోనే ఈ ప్రాజెక్టులు పూర్తయ్యాయని మోడీ తెలిపారు. గత ఎనిమిదేళ్లలో ఈశాన్య రాష్ట్రాల్లోని ఎయిర్ పోర్టుల సంఖ్య 9 నుండి16కి పెరిగినట్టుగా మోడీ గుర్తు చేశారు. అంతేకాదు ఈ ప్రాంతాలకు వచ్చే విమానాల సంఖ్య 900 నుండి 1900కి పెరిగిందని మోడీ తెలిపారు. రైల్వే మార్గాలు, జల రవాణాను కూడా విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టుగా మోడీ వివరించారు. 2014 నుండి జాతీయ రహదారులు 50 శాతం పెరిగినట్టుగా ప్రధాని చెప్పారు. డివైన్ పథకం తో ఈశాన్య రాష్ట్రాల్లో మౌళిక సదుపాయాల ప్రాజెక్టులు మరింత ఊపందుకున్నాయన్నారు. ఈశాన్య ప్రాంతంలో డిజిటల్ కనెక్టివిటిని పెంచడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రధాని తెలిపారు.

## తెలంగాణకు హరితహారం అద్భుత కార్యక్రమం

### –తెలంగాణలో పర్యటించిన తమిళనాడు అడిషనల్ చీఫ్ సెక్రటరీ సుప్రియా సాహు

హైదరాబాద్ డిసెంబర్ 18 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తెలంగాణకు హరితహారం అద్భుతమైన కార్యక్రమం అని, గత ఎనిమిదేళ్లుగా ఈ పథకం అమలు చేస్తూ గణనీయమైన పచ్చదనం రాష్ట్రం సాధించిందని కొనియాడారు తమిళనాడు అడిషనల్ చీఫ్ సెక్రటరీ (అడవులు, పర్యావరణం, వాతావరణ మార్పుల శాఖ) సుప్రియా సాహు. తెలంగాణకు హరితహారం తరహాలోనే తమిళనాడు గ్రీన్ మిషన్ అనే కార్యక్రమం అమలు చేయటం ద్వారా 33 శాతం పచ్చదనం సాధించాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో హరితహారం కార్యక్రమాన్ని అధ్యయనం చేసేందుకు సీనియర్ అధికారి సుప్రియా సాహు తెలంగాణలో పర్యటించారు. ముందుగా అరణ్య భవన్ లో అటవీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఏ.శాంతి కుమారి, పీసీసీఎఫ్ ఢ హెచ్ఓఎఫ్ ఆర్.ఎం.డోబ్రియాల్, అధికారులతో సాహూ సమావేశం అయ్యారు. గత ఎనిమిదేళ్లుగా హరితహారం అమలు, ఫలితాలపై పీసీసీఎఫ్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటయ్యాక పచ్చదనం పెంపును ఒక ప్రాధాన్యతా పథకంగా (ఫ్లాగ్ షిప్ ప్రోగ్రామ్) ప్రభుత్వం అమలు చేసిందని, ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర రావు పట్టుదలతో కార్యక్రమం అమలును పర్యవేక్షించారని అధికారులు వివరించారు. ఆ తర్వాత అధికారుల బృందం దూలపల్లి, శంషాబాద్ నర్సరీలు, కండ్లకోయ ఆక్సిజన్ పార్క్, సిరిగిరిపురం, నాగారం అర్బన్ ఫారెస్ట్ పార్క్ లను, ఔటర్ రింగ్ రోడ్డు గ్రీనరీని పరిశీలించారు. నర్సరీల నిర్వహణతో పాటు, పచ్చదనం పెంచిన తీరు అద్భుతంగా ఉందని, అవెన్యూ ప్లాంటేషన్ (రహదారి వనాలు), అర్బన్ ఫారెస్ట్ పార్కులు, ఔటర్ వెంట పచ్చదనం తీర్చిదిద్దిన విధానం చాలా బాగుందని సాహు తెలంగాణ అటవీ శాఖను, అధికారులను అభినందించారు. మిగతా శాఖలతో పాటు, హెచ్ ఎండీఏ, జీహెచ్ఎంసీలతో సమన్వయం చేసిన విధానం అడిగి తెలుసుకున్నారు. త్వరలో తెలంగాణ అధికారుల బృందాన్ని తమిళనాడుకు అహ్వానిస్తామని, తమ అధికారులకు హరితహారం అమలు తీరును వివరించేలా చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. పర్యటనలో తాను తీసుకున్న ఫోటోలను, వీడియోలను సాహూ స్వయంగా ట్విట్టర్ ద్వారా పంచుకున్నారు. కొద్ది గంటల్లోనే ఆమె పోస్ట్ వైరల్ అయింది. సుప్రియా సాహూ వెంట తమిళనాడు సీనియర్ ఐఎఫ్ఎస్ అధికారి ఆనంద్ ఉన్నారు. క్షేత్ర పర్యటనలో చీఫ్ కన్జర్వేటర్ (సోషల్ ఫారెస్ట్రీ) రామలింగం, రంగారెడ్డి, మేడ్చల్ డీఎఫ్ఓలు జాదవ్ రాహుల్ కిషన్, జానకి రాములు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. రాష్ట్రంలో పచ్చదనం పెంపు, 33 శాతం గ్రీనరీ సాధించటమే లక్ష్యంగా



ఎనిమిదేళ్లుగా తెలంగాణకు హరితహారం అటవీశాఖ అమలు చేస్తోంది. ముఖ్యమంత్రి కేసీయార్ మానస పుత్రికగా హరితహారం కార్యక్రమం పేరొందింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఈ కార్యక్రమం ప్రశంసలు అందుకుంది. అనేక రాష్ట్రాల ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు హరితహారం అమలును అధ్యయనం చేసి, ప్రశంసించాయి. కేంద్ర ప్రభుత్వం కూడా అనేక సార్లు కార్యక్రమాన్ని మెచ్చుకుంది. ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా నివేదికల ప్రకారం తెలంగాణలో పచ్చదనం 6.7 శాతం పెరిగింది. ఇటీవలే ప్రపంచ గ్రీన్ సిటీ అవార్డును కూడా హైదరాబాద్ సొంతం చేసుకుంది. ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, తమిళనాడు, కేరళ, తదితర రాష్ట్రాల తమ అధికారుల బృందాలను పంపి హరితహారం కార్యక్రమాన్ని అధ్యయనం చేసి, ఆయా రాష్ట్రాల్లో అమలు చేసేందుకు నిర్ణయించాయి. గత యేడాది అన్ని రాష్ట్రాల అటవీ సంరక్షణ ప్రధాన అధికారుల బృందం కూడా తెలంగాణలో పర్యటించి పచ్చదనం పెంపు, అర్బన్ పార్కుల అభివృద్ధిని ప్రశంసించింది.

## చైనాలో కరోనా తీవ్రరూపం.. 10 లక్షల మంది మృతి?




న్యూ డిల్లీ డిసెంబర్ 18 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );చైనాలోని వుహాన్ నగరంలో తొలిసారి కరోనా కేసులు వెలుగు చూశాయి. ప్రజలంతా ఫ్లూ.. జ్వరం.. వాంతులతో ఆస్పత్రుల పాలవడంతో తొలుత దీనిని వైరల్ ఫీవర్ గా చైనా భావించింది. ఈ క్రమంలోనే అంతుచిక్కని లక్షణాలతో ప్రజలు మరణిస్తుండటంతో అప్పుడు చైనా దీనిని కరోనాగా గుర్తించి కఠిన చర్యలు చేపట్టింది. అయితే అప్పటికే కరోనా వైరస్ చైనాను దాటి ఇతర దేశాలకు పాకింది.అమెరికా.. ఇటలీ.. బ్రిటన్ వంటి అగ్రరాజ్యాలు కరోనా ధాటికి విలవిల లాడిపోయాయి. కరోనా ఫస్ట్ వేవ్ లో అక్కడి ఆస్పత్రులన్నీ కోవిడ్ పేషంట్లతో కిక్కిరిసిపోయాయి. అప్పటి కరోనాకు వ్యాక్సిన్ అందుబాటులోకి రాకపోవడతో లక్షలాది మంది అమాయక ప్రజలు ప్రాణాలను కోల్పోవాల్సి వచ్చింది. ఆ తర్వాత ప్రజలంతా కరోనా జాగ్రత్తలు తీసుకోవడం.. వ్యాక్సిన్ అందుబాటులోకి రావడంతో క్రమంగా కేసులు తగ్గుముఖం పట్టాయి.

ప్రస్తుతం అన్ని దేశాల్లో కరోనా కట్టడిలోనే ఉంది. ఒక్క చైనాలో మాత్రం కోవిడ్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. చైనాలో ఒమ్రికాన్ వైరస్ ప్రజలపై తీవ్రంగా ప్రభావం చూపుతుండటంతో ప్రభుత్వం జీరో కోవిడ్ విధానాన్ని అనుసరించింది. అయితే ఈ విధానం వల్ల ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కోవడంతో స్థానికుల నుంచి పెద్ద ఎత్తున ఆందోళనలు మొదలయ్యాయి.జీరో కోవిడ్ విధానానికి వ్యతిరేకంగా ప్రజలు నిరసనలు ఎక్కువగా కావడంతో చైనా ఇటీవల ఆ నిబంధనలను ఎత్తివేసింది. దీంతో గత 15 రోజులుగా చైనాలో లక్షల్లో కరోనా కేసులు నమోదు అవుతున్నాయి. ప్రజలంతా చైనా ఆస్పత్రుల ముందు క్యూ కడుతున్నారు. ఈ నేపథ్యంలోనే అమెరికాకు చెందిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ మెట్రిక్స్ ఎవాల్యుయేషన్(ఐహెచ్ఎంఈ) 2023లో చైనాలో 10 లక్షల మంది కరోనా మృతి చెందుతారని అంచనా వేసింది.చైనాలో పెరుగుతున్న కేసులు చూస్తుంటే ఏప్రిల్ నాటికి ఆ సంఖ్య తారస్థాయికి చేరుతుందని పేర్కొంది. జనాభాలో మూడో వంతు ప్రజలు కరోనా బారిన పడే అవకాశం ఉందని ఐహెచ్ఎంఈ డైరెక్టర్ క్రిస్టోఫర్ ముర్రే తెలిపారు. చైనాలో ఒమ్రికాన్ వైరస్ చాపకింద నీరులా విజృంభిస్తుందని తెలిపారు. దీనిని ఎన్ని కఠిన నిబంధనలు అమలు చేసిన ఆపడం సాధ్యం కాదని ముర్రే స్పష్టం చేసింది. దీంతో చైనా సరిహద్దు దేశాలు సైతం ఒమ్రికాన్ వైరస్ పట్ల ముందస్తుగానే అప్రమత్తం అవుతున్నాయి.

## భూమిపై గ్రహాంతరవాసుల కదలికలపై అమెరికా సైన్యం కీలక ప్రకటన..!

న్యూ డిల్లీ డిసెంబర్ 18 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );విశ్వంలో మనిషి లాంటి జీవులు ఎక్కడైనా ఉన్నారా? అనే ప్రశ్నకు ఇప్పటివరకు సైంటిస్టులు సమాధానాన్ని కనుక్కోలేక పోయారు. భూమి తప్ప మరే గ్రహం లేదా విశ్వంలో జీవుల మనుగడ కనిపించడం లేదని ఇప్పటివరకు కొనసాగిన పరిశోధనల్లో వెల్లడైంది. అంతరిక్ష ప్రయోగాలకు కేరాఫ్ గా నిలిచే అమెరికా.. చైనా.. భారత్ లాంటి దేశాలు చంద్రుడు.. అంగారక గ్రహంపై నీటి ఆనవాళ్లు ఉన్నాయని.. అక్కడ మనుషులు జీవించడానికి పరిస్థితులు అనుకూలిస్తామంటూ పేర్కొంటున్నాయి.ఈ నేపథ్యంలోనే అంగారక.. చంద్రుడిపై ఇటీవల కాలంలో ప్రపంచ దేశాలు దృష్టి సారిస్తున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలైతే అంగారకుడు.. చంద్రుడిపై ఏకంగా కాలనీ నిర్మించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే మనిషి మరో గ్రహం మీద జీవిస్తే అప్పుడు అతడే భూమిపై ఉన్న మనిషికి గ్రహాంతర వాసిగా మారడం ఖాయంగా కనిపిస్తోంది. ఇదంతా ఫన్నీగా అనిపిస్తున్న అది త్వరలో నిజం కాబోతుందని ప్రస్తుత పరిశోధనలు చూస్తే అర్థమవుతుంది.ఇక భూమిపై గ్రహాంతర వాసుల కదిలికలపై భిన్నమైన వాదనలు తరుచూ విన్పిస్తున్నాయి. ఆకాశంలో యూఎఫ్ఓ(అన్ డిఫైన్డ్ ఫ్లైయింగ్ అబ్జెక్ట్) తిరగడం చూశామని పలువురు చెబుతున్నారు. అయితే వీటిపై ఇప్పటికి సరైన ఆధారాలు లేకపోవడంతో గ్రహాంతర వాసులు అనేవారు ఉన్నారా? లేదా అనే చర్చ దశాబ్దాలుగా నడుస్తూనే ఉంది. ఇదే విషయంపై అమెరికా సైనికా అధికారులు తాజాగా మాట్లాడుతూ గ్రహాంతర వాసులకు సంబంధించిన జాడ ఇప్పటికైతే లభించలేదని స్పష్టం చేశారు.అయితే గ్రహాంతర వాసులు లేరని మాత్రం కొట్టిపారేయలేమని చెబుతున్నారు. గ్రహంతర వాసుల వ్యోమ నౌకలుగా భావిస్తున్న ఫ్లయింగ్ సాసర్లో ఏలియన్స్ తరుచూ భూమిపై వస్తున్నారని చెప్పడానికి తమ వద్ద ఇప్పటివరకు సరైన ఆధారాలు లభించలేదని పేర్కొన్నారు. అదేవిధంగా యూఎఫ్ఓ లకు సంబంధించిన వందలాది ఘటనలపై నివేదికలు తయారు చేస్తున్నామని అమెరికా రక్షణ శాఖ అండర్ సెక్రెటరీ రోనాల్డ్ మౌల్ట్రీ స్పష్టం చేశారు.మరోవైపు ఏలియన్స్ జాడ కనుగొనేందుకు శాస్త్రీయ పరిశోధనలు చేస్తున్నట్లు పెంటాగాన్ కొత్తగా ఆల్ డొమైన్ అనోమలీ రిజల్యూషన్ ఆఫీస్ డైరెక్టర్ సీన్ కిర్క్ ప్యాట్రిక్ తెలిపారు.

అమెరికాలోని నిషేధిత గగన స్థలం.. ఇతరత్ర పదేశాల్లో అసాధారణ గుర్తు తెలియని వస్తువుల కార్యకలాపాలపై ఈ సంస్థ దృష్టి సారిస్తుందన్నారు. తద్వారా సైన్యానికి.. జాతీయ భద్రత ముప్పు వంటి అంశాలపై ప్రభుత్వాన్ని అప్రమత్తం చేస్తుందని తెలిపారు.140కి పైగా యూఎఫ్ఓ సంబంధిత ఘటనలపై ప్రభుత్వం గతేడాది నివేదికలను తయారు చేసిందని పేర్కొన్నారు. ఆ తర్వాత ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నాయని వెల్లడించారు. ఈ సంఖ్య మే నాటికి 400లకు చేరుకోవచ్చని నేవీ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. వీటన్నింటిని పరిశోధించి గ్రహాంతర వాసుల జాడపై త్వరలోనే ఒక నిర్ణయానికి రానున్నట్లు పెంటగాన్ అధికారులు తాజాగా ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది.

## రైతులకు శుభవార్త.. డిసెంబర్ 28 నుంచి ఖాతాల్లోకి రైతుబంధు

హైదరాబాద్, డిసెంబర్ 18: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు శుభవార్త వినిపించింది. యాసంగి పంట కాలానికి అందించే పంట పెట్టుబడి రైతుబంధు నిధులను డిసెంబర్ 28 నుంచి విడుదల చేయడం ప్రారంభించాలని, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావును సీఎం కేసిఆర్ ఆదేశించారు. రైతు బంధు నిధులు, ఎప్పటిలాగే ఒక ఎకరం నుంచి ప్రారంభమై సంక్రాంతి కల్లా రైతులందరి ఖాతాల్లో జమ కానున్నాయి. ఇందుకోసం గాను రూ. 7,600 కోట్లను, రైతుల ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం జమ చేయనున్నది.

# 2023లో గ్రహాంతర వాసుల దాడి జరుగనుందా?!

## (ప్రపంచ ప్రఖ్యాత 'వంగా బాబా భవిష్యవాణి' ఆధారంగా)

ప్రపంచ ప్రఖ్యాత దివ్యదృష్టి కలిగి భవిష్యవాణి చెప్పగలిగిన బల్గేరియన్ అంధ మహిళ వంగా బాబా 03 అక్టోబర్ 1911న జన్మించి 11 ఆగష్టు 1996న తుది శ్వాస విడిచింది. బాల్యం నుంచే కంటి చూపు కోల్పోయిన బాబా వంగకు ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల అభిమానులు ఉన్నప్పటికీ తను ప్రతిపాదించిన పలు భవిష్యత్ అంచనాలు తారుమారు కావడంతో పలువురు విమర్శకుల వ్యతిరేకతను కూడా ఎదుర్కొన్నది. బ్రెయిలీ అక్షరాస్య జ్ఞానం కలిగిన బాబా వంగ దివ్యదృష్టి ప్రకారం 2022లో జరుగనున్న సంఘటనలు విశ్వ మానవాళి జీవితాల్లో పెను మార్పులు తేనున్నాయని చెప్పబడింది. వంగ బాబా చెప్పిన అంశాల్లో 11 సెప్టెంబర్ టెరరిస్ట్ దాడి, 2004 సునామీ, ఒబామా ఎన్నిక, బ్రెక్సిట్ ఓటు, తన మరణ తేదీని ఊహించడం లాంటి కొన్ని భవిష్యవాణిలు నిజం కావడం చూశాం. 2021 భవిష్యవాణి ప్రకారం ప్రపంచ మానవాళిని డ్రాగన్ (చైనా) కరోనా వైరస్ కూపంలో ఆక్రమించనుందని పేర్కొంది. డ్రాగన్‌కు వ్యతిరేకంగా మూడు భారీ దేశాలు ఏకం అవుతాయని తెలిపింది. చెర్నోబిల్ అణురియాక్టర్ విస్ఫోటనం, ప్రిన్స్ డయానా మరణం, సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం, 9/11 ట్విన్ టవర్స్ కూల్చివేత లాంటి పలు విషయాలను వంగా బాబా భవిష్యవాణి చెప్పగలిగింది.

### 2023లో జరుగనున్న ముఖ్య సంఘటనలు:

వంగ బాబా అంచనాల ప్రకారం 2023లో భయంకర విధ్వంసాలతో చీకట్లు కమ్ముకుంటాయి. న్యూక్లియర్ మెల్ట్‌డౌన్ ఫలితంగా భూకక్ష్య మారుతుందని చెప్పబడింది. ల్యాబ్ చైల్డ్ అవతరణంతో పాటు పలు ఆసక్తికర శాస్త్ర అన్వేషణలు జరుగుతాయి. తల్లితండ్రులు ల్యాబ్ చైల్డ్ టెక్నాలజీతో తమ పిల్లల చర్మ రంగులను నిర్ణయించుకునే స్థాయి వస్తుందని తెలుపబడింది. ఇదే జరిగితే మనిషి సృష్టికి ప్రతి సృష్టి చేసినట్లుగా అవుతుందనడంలో అతిశయోక్తి లేదు. 2023లో ఏలియన్ అటాక్ (గ్రహాంతరవాసుల దాడులు), సోలార్ సునామీలు (సౌర సునామీ) రావచ్చని పేర్కొనబడింది. ఉక్రెయిన్ రష్యా యుద్ధంతో మరో రూపంలో యూయస్‌యస్‌ఆర్ ఆవిర్భావం జరుగుతుందని తెలుపబడింది. జీవ ఆయుధాల వినియోగం జరుగుతుంది. జనాభా పెరుగుదలతో నదులు ఎండి పోయి అనేక పట్టణాల్లో తీవ్ర త్రాగు నీటి కొరత రానుంది. గతంతో పోల్చితే ప్రపంచ మానవాళి టీవీలు, సెల్ ఫోన్ల తెరల ముందు అధిక సమయం గడపడం అనే సాంకేతిక దుర్వాసనానికి లోనవుతారు. ప్రపంచవ్యాప్తంగా వాతావరణ ప్రతికూల మార్పులతో తీవ్ర కరువు కాటకాలు ఏర్పడి ప్రజలు ఆకులు, మన్ను, గడ్డలు తినాల్సి వస్తుంది.

శాస్త్రజ్ఞులు ప్రమాదకర వైరస్‌ను గుర్తిస్తారని, ఈ వైరస్ వేగంగా వ్యాపించగలిగి అసంఖ్యాక మానవ, జంతు మరణాలకు కారణం కానుంది. భూమండలం అణ్వాయుధాల నెలవు కానుందని వంగ బాబా అంచనా. రానున్న ఏండ్లలో భూగ్రహంపైకి గ్రహాంతర వాసులు (ఎలియన్స్) రానున్నారని వంగ అంచనా వేసింది. 2033–45 మధ్య ధృవాల్లోని మంచు కొండలు కరిగి పోయి సముద్ర మట్టం పెరుగనుంది.

"నాస్ట్రడామస్ ఆఫ్ బల్గేరియా"గా పిలుచుకునే వంగ బాబా దివ్యదృష్టితో అంచనా వేసిన పలు సంఘటనలు జరగడంతో ప్రపంచ మానవాళి బాబా వైపు ఆకర్షితులు కావడం, ఆమె మాటలను నమ్మడం ప్రారంభమైంది. వంగ బాబా అంచనా వేసిన వాతావరణ మార్పులు, సాంకేతిక విప్లవం, భూతాపం, హిమశిఖరాలు కరిగి సముద్రమట్టం పెరగడం, అణ్వాయుధాలు, వైరస్ వ్యాప్తి, డ్రాగన్ చైనా దాష్టికాలు, తాగు నీటి కొరత, కరువు కాటకాలు, విపత్తులు లాంటి సంఘటనలను ప్రస్తుతం మానవాళి అనుభవిస్తున్నది.

ఈ భవిష్యవాణి వాస్తవమా, కల్పితమా అనే విషయాలను చర్చించడం మరిచి, మన భూగ్రహాన్ని నివాసయోగ్య ఆలయంగా మార్చుకునే యజ్ఞంలో అందరం భాగస్వామ్యం పొందుదాం.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# భారతీయులకు మరో గుడ్ న్యూస్.. 15 రోజుల్లోనే టూరిస్టు వీసాలు..!

న్యూ డిల్లీ డిసెంబర్ 18 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );బ్రిటన్ ప్రధానిగా రిషి సునాక్ బాధ్యతలు చేపట్టిన తర్వాత కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. కొన్నేళ్లుగా భారత్–బ్రిటన్ మధ్య సత్సంబంధాలు ఉండగా రిషి సునాక్ వాటిని మరింత ముందుకు తీసుకెళ్తున్నారు. బ్రిటన్ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతూ భారత్ తో మైత్రీ బంధాన్ని మరింత బలోపేతం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు.ఈ ఏడాది బాలిలో జరిగిన జీ 20 సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ సహా ఆయా దేశాల అధినేతలు పాల్గొని పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా బ్రిటన్ ప్రధాని రిషి సునాక్.. భారత ప్రధాని మోదీ మధ్య కీలక చర్చలు జరిగాయి. ఈ క్రమంలోనే రిషి సునాక్ ను భారత పర్యటనకు రావాలని మోదీ ఆహ్వానించారు.వీరిద్దరి కలయిక తర్వాత బ్రిటన్ ప్రధాని కార్యాలయం ఒక కీలక ప్రకటన విడుదల చేసింది. భారతీయులకు ఇప్పటి వరకు ఇస్తున్న వీసా కోటాను పెంచుతున్నట్లు పేర్కొంది. ప్రతి ఏడాది మూడు వేలకు పైగా బ్రిటన్ వీసాలను భారతీయులను అదనంగా ఇవ్వనున్నట్లు వెల్లడించిన సంగతి తెలిసిందే.18 నుంచి 30 ఏళ్ల లోపు ఉండి కలిగి డిగ్రీ పట్టా ఉన్న భారతీయులు తమ దేశంలో రెండేళ్లపాటు పని చేసుకోవడానికి అవకాశం కల్పిస్తున్నట్లు బ్రిటన్ విదేశీ మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ నిర్ణయం ద్వారా భారత్ బ్రిటన్ మధ్య మైగ్రేషన్.. మొబిలిటీ పార్ట్నర్షిప్ మరింత బలపడుతుందని అభిప్రాయం వ్యక్తం చేసింది.ఇండో ఫసిపిక్ రీజయన్ లోని అన్ని దేశాల కంటే భారత్ తోనే బ్రిటన్ అత్యంత సన్నితంగా కొనసాగుతోందని పేర్కొంది. ఇక విదేశాల నుంచి బ్రిటన్ వస్తున్న విద్యార్థుల్లో భారతీయులే నాలుగోవంతు ఉన్నారని వెల్లడించింది. తాజాగా బ్రిటన్ భారతీయులకు మరో గుడ్ న్యూస్ చెప్పింది. ఇకపై బ్రిటన్ కు పర్యటన వచ్చే భారతీయులకు 15 రోజుల్లోనే టూరిస్టు వీసాలను అందజేయనున్నారు.ఈ విషయాన్ని బ్రిటిష్ హై కమిషనర్ అలెక్స్ ఎల్లిష్ తాజాగా ప్రకటించారు. ఈ ఏడాది చివరి నాటికి భారతీయులకు 15రోజుల్లోనే విజిట్ వీసాలు ఇస్తామని తాము రెండు నెలల క్రితమే ప్రకటించామని తెలిపారు. ఇంకా ముందుగా కావాలనుకువారే 'ప్రియారిటీ వీసా' విధానాన్ని కూడా పయోగించుకోవచ్చని తెలిపారు. వీరికి ఐదు రోజుల్లో వీసా వస్తుందని తెలిపారు. స్టూడెంట్ వీసాలను పెద్ద సంఖ్యలో ఇస్తున్నామని భారతీయులు వీలైనంత త్వరగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

# ఎర్ర 'బంగారం' విక్రయానికి.. కేంద్రం గ్రీన్ సిగ్నల్



తిరుపతి డిసెంబర్ 18: రాష్ట్రంలో మళ్ళీ ఎర్ర చందనం వేలం సందడి మొదలైంది. ప్రస్తుతం అటవీశాఖ ఆధీనంలో ఉన్న ఎర్రచందనం నిల్వల విక్రయానికి కేంద్ర ప్రభుత్వం తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం గ్లోబల్ టెండర్లు పిలవడానికి సిద్ధమైంది. అధికారిక గణాంకాల ప్రకారం గత రెండు దశబ్దాల మధ్యకాలంలో గ్లోబల్ టెండర్ల ద్వారా 12 విడతలలో 1,400 టన్నుల ఎర్రచందనాన్ని విక్రయించగా.. రాష్ట్రానికి రూ. 1,850 కోట్ల ఆదాయం లభించింది. ప్రస్తుతం తిరుపతిలోని కరకంబాడి వద్ద ఎర్రచందనం సెంట్రల్ గోడౌన్‌లో 5,600 టన్నుల దుంగలు అమ్మకానికి సిద్ధంగా ఉంది. అంతేకాక తిరుపతిలోనే కపిలతీర్థం వద్ద ఉన్న అటవీ శాఖ కార్యాలయం వద్ద మరో గోడౌన్‌లో దాదాపు 100 టన్నుల ఎర్రచందనం దుంగలు ఉన్నాయి.

## తెలంగాణ రచయితల సంఘం

### ఆహ్వానం

24.12.2022 శనివారం మధ్యాహ్నం 1.30 గంటలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రం మొదటి అంతస్తు హాలు, బాగ్ లింగంపల్లి, హైదరాబాదు.

### తెలుగుభాష - ఆధిపత్యాలు

సదస్సు

ఆహ్వానం : కందుకూరి శ్రీరాములు
తెరసం జంట నగరాల శాఖాధ్యక్షులు

అధ్యక్షత : డా. నాళేశ్వరం శంకరం
తెరసం రాష్ట్ర అధ్యక్షులు

ప్రస్తావన : డా. వి. శంకర్
తెరసం రాష్ట్రప్రధాన కార్యదర్శి

ప్రసంగాలు :

1. తెలుగుభాష-సాహిత్య ప్రభావం
   ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి
   ప్రముఖ సాహిత్య విమర్శకులు
2. తెలుగు-వివిధ భాషలు-ఆధిపత్యాలు
   డా. నలిమెల భాస్కర్
   ప్రముఖ భాషావేత్త
3. తెలుగుభాష-ప్రసార మాధ్యమాలు-ప్రభావాలు
   డా. కె. శ్రీనివాస్
   సంపాదకులు, ఆంధ్రజ్యోతి
4. భాషాధిపత్యాలు-ఉద్యమాలు-తెలుగు
   డా. నందిని సిధారెడ్డి
   ప్రముఖ కవి

మీరు తప్పక రావాలని మనవి.

--- తెలంగాణ రచయితల సంఘం

# కర్బన ఉద్గారాల నివారణ కోసం గ్రీన్ షిప్పింగ్

న్యూఢిల్లీ, డిసెంబర్ 18: నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ గ్రీన్ పోర్ట్ అండ్ షిప్పింగ్ (ఔఅనీఇఉఖూ)ని నెలకొల్పాలని ప్రభుత్వం ఇటీవల ప్రతిపాదించింది. రేవులు, నౌక రంగంలో గ్రీన్ హౌస్ వాయువుల విడుదల తగ్గించడానికి భారత ప్రభుత్వం నిర్ణయించిన లక్ష్యాన్ని చేరుకోవడానికి దోహదపడే సాంకేతిక అంశాలు,ప్రత్యామ్నాయ ఇంధనాలు, పునరుత్పాదక ఇంధన వనరులు అభివృద్ధికి కేంద్రం కృషి చేస్తుంది. గ్రీన్ హౌస్ వాయువుల విడుదల అంశంలో రేవులు, నౌక రంగాలకు కేంద్రం లక్ష్యాలు నిర్ణయిస్తుంది. గ్రీన్ షిప్పింగ్ రంగానికి అవసరమైన చట్టపరమైన వ్యవస్థను కేంద్రం అభివృద్ధి చేస్తుంది. గ్రీన్ షిప్పింగ్‌పై పరిశోధన మరియు సహకారం అందించి ఉత్తమమైన విధానాన్ని రూపొందించడంలో కేంద్రం సహకారం అందిస్తుంది. దేశంలో అన్ని రేవులు, షిప్పింగ్ సంస్థలు, తీరప్రాంతం కలిగిన రాష్ట్రాలు ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తించి, సమస్య పరిష్కారానికి అమలు చేయాల్సిన చర్యలపై పరిశోధన చేపట్టి మార్గదర్శకాలు అందిస్తుంది.

గ్రీన్ పోర్టులు, షిప్పింగ్ కోసం కేంద్ర ప్రభుత్వం తొలిసారిగా నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ గ్రీన్ పోర్ట్ అండ్ షిప్పింగ్ నెలకొల్పింది. దీనికి సంబంధించి 2022 నవంబర్ 18న కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్ మరియు జలమార్గాల మంత్రిత్వ శాఖ , దీనదయాళ్ పోర్ట్ అథారిటీ, కాండ్లా, పారాదీప్ పోర్ట్ అథారిటీ, పారదీప్; వి.ఓ. చిదంబరనార్ పోర్ట్ అథారిటీ, తూత్తుకుడి; కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్, కొచ్చి ది ఎనర్జీ అండ్ రిసోర్స్ ఇన్స్టిట్యూట్ (ఽఇఖీఎ) ల మధ్య అవగాహన కుదిరింది.

భారతదేశంలోని షిప్పింగ్ రంగంలో కర్బన ఉద్గారాలను తగ్గించడం, మరియు సర్క్యులర్ ఎకానమీ (అఇ)ని ప్రోత్సహించడానికి గ్రీన్ షిప్పింగ్ కోసం నియంత్రణ వ్యవస్థ, తాజా సాంకేతిక అంశాలు, సాంకేతిక అంశాల అమలుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక అభివృద్ధి చేయడానికి అవసరమైన విధానం, నియంత్రణ వ్యవస్థను నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ గ్రీన్ పోర్ట్ అండ్ షిప్పింగ్ రూపొందిస్తుంది.నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ గ్రీన్ పోర్ట్ అండ్ షిప్పింగ్ భాగస్వామ్య సంస్థగా 'ది ఎనర్జీ అండ్ రిసోర్సెస్ ఇన్‌స్టిట్యూట్' (ఽఇఖీఎ) వ్యవహరిస్తుంది.

నార్వే ప్రభుత్వం నిధులు సమకూర్చిన నిధులతో ఏర్పాటైన ఇంటర్నేషనల్ మారిటైం ఆర్గనైజేషన్ గ్రీన్ వాయేజ్ 2050 లో ప్రధాన దేశంగా భారతదేశం ఎంపికయ్యింది. నౌకల నుంచి విడుదల అయ్యే గ్రీన్ హౌస్ వాయువుల పరిమాణాన్ని తగ్గించడానికి సంస్థ సూచనలు, సలహాలు అందిస్తుంది. గ్రీన్ షిప్పింగ్ ప్రాజెక్టులను ప్రయోగాత్మకంగా భారతదేశంలో అమలు చేయాలని ఇంటర్నేషనల్ మారిటైం ఆర్గనైజేషన్ గ్రీన్ వాయేజ్ 2050 నిర్ణయించింది. ప్రాజెక్టులను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ పర్యవేక్షిస్తుంది.గ్రీన్ వాయేజ్ 2050 కింద అమలు చేయడానికి 5 ప్రాజెక్టులను ప్రభుత్వం గుర్తించింది. దీనిలో భాగంగా ప్రయాణీకుల ఫెర్రీల సేకరణ కోసం అస్సాం ఇన్‌ల్యాండ్ వాటర్ ట్రాన్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ సొసైటీ (ంఎచిఉఆూ) ఎంపిక చేయబడింది. ఫెర్రీల్లో ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వినియోగానికి సంబంధించిన అంశాలను ఇంటర్నేషనల్ మారిటైం ఆర్గనైజేషన్ గ్రీన్ వాయేజ్, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ నిపుణుల బృందం అభివృద్ధి చేసింది. ఫెర్రీలు ఉపయోగించే ప్రత్యామ్నాయ ఇంధనం, అస్సాంలో ఇంధనం లభ్యత మరియు సరఫరాతో పాటు భారతదేశంలో ప్రత్యామ్నాయ ఇంధన వినియోగం కోసం గల అవకాశాలు పరిశీలించడానికి ప్రపంచ బ్యాంకు, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ , అస్సాం ఇన్‌ల్యాండ్ వాటర్ ట్రాన్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రతినిధులు సభ్యులుగా ఓకే వర్కింగ్ బృందం ఏర్పాటయింది.

నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ గ్రీన్ పోర్ట్ అండ్ షిప్పింగ్ కార్యకలాపాలను ది ఎనర్జీ అండ్ రిసోర్స్ ఇన్స్టిట్యూట్ పర్యవేక్షించి అమలు చేస్తుంది. షిప్పింగ్, నౌకల రంగానికి అవసరమైన సాంకేతిక సహకారాన్ని సంస్థ అందజేస్తుంది. శాస్త్రీయ పరిశోధనలు నిర్వహించి రంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి మార్గాలు సూచిస్తుంది. దీంతో పాటు విద్య, పరిశోధన, సాంకేత అంశాల మార్పిడి పై కూడా సంస్థ సహకారం అందిస్తుంది. స్థానిక, జాతీయ, అంతర్జాతీయ స్థాయి కార్యక్రమాలు నిర్వహించే సంస్థ ఈ క్రింది అంశాలపై దృష్టి సారించి పనిచేస్తుంది.

శిలాజ ఇంధన వినియోగాన్ని తగ్గించడానికి మరియు నౌకల నిర్వహణ కోసం పునరుత్పాదక శక్తి వినియోగాన్ని ప్రోత్సాహించడం. దీనికోసం స్థిరమైన జీవ ఇంధనాలు మరియు దాని మిశ్రమాలను భారతీయ నౌకలు ఇంధనాలుగా ఉపయోగించడానికి అనుమతించింది.

ఉద్గారాల తగ్గింపు లక్ష్యంతో సముద్ర రంగం కోసం డిజిటలైజేషన్ ప్రయత్నాల్లో భాగంగా, భారతీయ తీరంలో పనిచేసే నౌకల కోసం సముద్ర పర్యావరణ నిర్వహణ కోసం డిజిటల్ ప్లాట్‌ఫారమ్ ప్రారంభించబడింది. నౌకలు ఇంధన చమురు వినియోగం, బ్యాలస్ట్ వాటర్ ఎక్స్ఛేంజ్ మరియు ఓడలో ఉత్పత్తయ్యే సముద్ర వ్యర్థాలు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌లు మొదలైన వాటితో సహా అన్ని కాలుష్య సంబంధిత సమాచారాన్ని సరళమైన, పేపర్‌లెస్ ఆన్‌లైన్ రిపోర్టింగ్‌ను సౌకర్యాన్ని డిజిటల్ పోర్టల్ కలిగి ఉంటుంది.

నౌకాశ్రయాలు, షిప్పింగ్ మరియు జలమార్గాల మంత్రిత్వ శాఖ ఇటీవల ఒక మారిటైమ్ ఇండియా విజన్ 2030 పత్రాన్ని ప్రచురించింది.

ఈ సమాచారాన్ని కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్ మరియు జలమార్గాల శాఖ మంత్రి శ్రీ సర్బానంద సోనోవాల్ లోక్‌సభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో తెలిపారు.

# ప్రతిష్టాత్మక జాతీయ సాంకేతిక అవార్డులు, 2023 కోసం దరఖాస్తులు ఆహ్వానించిన టీడీబీ డీఎస్టి

న్యూఢిల్లీ, డిసెంబర్ 18:పోఖ్రాన్ శ్రేణిలో భారత సైన్యం 1998 మే 11న విజయవంతంగా నిర్వహించి దేశానికి చిరస్మరణీయ, గర్వించదగిన విజయాన్ని అందించింది. ఈ చిరస్మరణీయ విజయం సాధించిన తర్వాత అప్పటి ప్రధానమంత్రి దివంగత శ్రీ అటల్ బిహారీ వాజ్‌పేయి భారతదేశాన్ని పూర్తి అణు దేశంగా ప్రకటించారు. అప్పటి నుంచి శాస్త్ర సాంకేతిక రంగాల్లో అంకిత భావంతో పని చేస్తూ ఘన విజయాలు సాధించిన శాస్త్రవేత్తలు, పరిశోధకులు, ఇంజనీర్ల గౌరవార్థం భారతదేశం ప్రతి ఏడాది మే 11 వ తేదీని జాతీయ సాంకేతిక దినోత్సవం గా పాటిస్తోంది.

జాతీయ సాంకేతిక దినోత్సవం సందర్భంగా కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ ఆధ్వర్యంలో రాజ్యాంగబద్ధంగా ఏర్పాటైన టెక్నాలజీ డెవలప్మెంట్ బోర్డు(టీడీబీ) దేశాభివృద్ధికి సహకరిస్తున్న వినూత్న సాంకేతిక ఆవిష్కరణలను గుర్తించి 1999 నుంచి జాతీయ సాంకేతిక అవార్డులు ప్రధానం చేస్తోంది. 2000 లో ఎస్‌ఎస్ఐ యూనిట్లను జాతీయ అవార్డుల జాబితాలో చేర్చింది. ప్రస్తుతం ఈ యూనిట్లను ఎంఎస్ఎంఈ లుగా గుర్తించారు ఇంతేకాకుండా, దేశాభివృద్ధికి స్టార్టప్ సంస్థలు అందిస్తున్న సేవలను గుర్తించడానికి 2004లో టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్ విభాగంలో అవార్డు ప్రవేశ పెట్టడం జరిగింది. వాణిజ్య పరంగా అభివృద్ధి సాధించడానికి అవకాశం ఉన్నసాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చేసిన స్టార్టప్ సంస్థలకు ఈ అవార్డు అందిస్తారు. 2021 నుంచి శాస్త్ర సాంకేతిక రంగంలో 'ట్రాన్స్‌లేషనల్ రీసెర్చ్' విభాగంలో అవార్డు ప్రవేశపెట్టారు.

2021 సంవత్సరానికి సంబంధించి జాతీయ సాంకేతిక అవార్డుల కోసం టీడీబీ దరఖాస్తులు ఆహ్వానించింది. ప్రధాన ,ఎంఎస్ఎంఈ, స్టార్టప్,ట్రాన్స్‌లేషనల్ రీసెర్చ్, టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్ విభాగాల్లో అవార్డులు అందజేయడం జరుగుతుంది. వాణిజ్య అభివృద్ధికి అవకాశం ఉన్న స్వదేశీ ఆవిష్కరణలకు అవార్డులు అందిస్తారు. ఆత్మ నిర్భర్ భారత్ సాధన కోసం తమ వంతు సహకారం అందించేలా పరిశ్రమలను ప్రోత్సహించడానికి ఈ అవార్డులు అవకాశం కలిగిస్తాయి.

స్వదేశీ సాంకేతికతను వాణిజ్య పరంగా అభివృద్ధి చేసేందుకు జరిగిన కృషికి గుర్తింపు గా జాతీయ సాంకేతిక అవార్డు (ప్రధాన) అవార్డు అందిస్తారు. ఏప్రిల్ 2017 లేదా ఆ తర్వాత స్వదేశీ సాంకేతికతను విజయవంతంగా అభివృద్ధి చేసి వాణిజ్యీకరించిన విజయానికి గుర్తింపుగా ఈ అవార్డు ఇవ్వబడుతుంది. ఒకవేళ, సాంకేతిక అభివృద్ధి చేసిన వారు /సేవలు అందిస్తున్నవారు మరియు టెక్నాలజీ కమర్షియల్‌లైజర్ రెండు వేర్వేరు సంస్థలు అయితే ప్రతి ఒక్కరికి 25 లక్షల నగదు, ట్రోఫీ అందిస్తారు.

# ఎమ్మెల్యే మల్లాది విష్ణు కుమార్తె వివాహానికి హాజరైన.. సీఎం జగన్



అమరావతి డిసెంబర్ 18:సీఎం జగన్ విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు కుమార్తె ..డాక్టర్ లలిత నాగదుర్గ వివాహానికి హాజరైయ్యారు. మంగళగిరి సీకే కన్వెన్షన్స్ లో ఈ వివాహం ఘనంగా జరిగింది. ఈ పెళ్లి వేడుకకు సీఎం జగన్ హాజరయిన సీఎం జగన్ కు మల్లాది విష్ణు, ఆయన కుటుంబ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. వివాహ మండపం వద్దకు చేరుకున్న సీఎం జగన్ వధూవరులు డాక్టర్ లలిత నాగదుర్గ, డాక్టర్ సాయి సూర్యతేజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. వారికి ఆశీస్సులు అందజేశారు. ఈ వివాహానికి మంత్రి జోగి రమేశ్, ఇతర వైసీపీ నేతలు కూడా హాజరయ్యారు.

# హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీలో ఐసీఎంఆర్ - ఎన్ఏఆర్ఎఫ్ బీఆర్ (నేషనల్ యానిమల్ రిసోర్స్ ఫెసిలిటీ ఫర్ బయో మెడికల్ రీసెర్చ్)

న్యూఢిల్లీ, డిసెంబర్ 18: దేశాభివృద్ధిలో పరిశోధన, ఆవిష్కరణలు కీలక అంశాలుగా ఉంటాయి. భారతదేశం స్వదేశీ పరిశోధనలకు ప్రోత్సాహాన్ని అందించింది. పరిశోధనల ఫలితాలు ఇప్పుడు కనిపిస్తున్నాయి. 21వ శతాబ్దపు బయోమెడికల్ పరిశోధనలో భారతదేశాన్ని ఒక కీలకమైన ప్రపంచ శక్తిగా మార్చగల సామర్థ్యాన్ని ఐసీఎంఆర్ – ఎన్ఏఆర్ఎఫ్ బిఆర్ కలిగి ఉంది. మానవులు, జంతువులపై పరిశోధనలు జరిగే సమయంలో నైతిక విలువలు పాటించి తగిన సంక్షేమాన్ని అంతర్జాతీయ ప్రమాణాల మేరకు పాటించాల్సి ఉంటుంది. అత్యున్నత అంతర్జాతీయ ప్రమాణాలు పాటిస్తూ నాణ్యమైన సేవలు అందించడం ద్వారా ఎన్ఏఆర్ఎఫ్ బిఆర్ దేశంలో ఆరోగ్య, సంక్షేమ రంగాల అభివృద్ధికి సహకరిస్తుంది.' అని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ పేర్కొన్నారు ఈ రోజు హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీలో ఐసీఎంఆర్ – ఎన్ఏఆర్ఎఫ్ బిఆర్ (నేషనల్ యానిమల్ రిసోర్స్ ఫెసిలిటీ ఫర్ బయో మెడికల్ రీసెర్చ్)ని తెలంగాణ కార్మిక మరియు ఉపాధి శాఖ మంత్రి శ్రీ సి. మల్లా రెడ్డి సమక్షంలో డాక్టర్ మాండవీయ ప్రారంభించారు.

స్వదేశీ పరిశోధనలకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని డాక్టర్ మాండవీయ వివరించారు. 'కోవిడ్ మహమ్మారి సమయంలో దేశంలో వ్యాక్సిన్ సిద్ధం కావాలని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నిర్ణయించారు. ప్రపంచం వ్యాక్సిన్ కొరత ఎదుర్కొంటున్న సమయంలో దేశ శాస్త్రవేత్తల సహకారంతో సవాల్ ఎదుర్కోవడానికి సిద్ధమయ్యింది. మన శాస్త్రవేత్తలు తమ శక్తి సామర్థ్యాలు ప్రదర్శించి వ్యాక్సిన్ అభివృద్ధి చేశారు. విదేశాల నుంచి వ్యాక్సిన్ దిగుమతి చేసుకోవడానికి 5 నుంచి 10 సంవత్సరాలు పట్టేది. అయితే, రాజకీయ వర్గాలు , సంబంధిత వర్గాల నుంచి అందిన సంపూర్ణ సహకారంతో మన శాస్త్రవేత్తలు ఏడాది కాలంలో వ్యాక్సిన్ అభివృద్ధి చేశారు' అని డాక్టర్ మాండవీయ వివరించారు.

జంతువుల ద్వారా సంక్రమించే వ్యాధులు, వ్యాధి నివారణ, చికిత్స అంశాలపై జంతువులపై పరిశోధనలు చేయాల్సి ఉంటుంది. దీనికి సంబంధించిన అన్ని సౌకర్యాలు నేషనల్ యానిమల్ రిసోర్స్ ఫెసిలిటీ ఫర్ బయో మెడికల్ రీసెర్చ్ కలిగి ఉంటుంది. పరిశోధన సమయంలో నైతిక విలువలకు ప్రాధాన్యం ఇస్తూ జంతువులకు అవసరమైన సంరక్షణను నేషనల్ యానిమల్ రిసోర్స్ ఫెసిలిటీ ఫర్ బయో మెడికల్ రీసెర్చ్ అందిస్తుంది. అధునాతన సౌకర్యాలతో ఏర్పాటైన నేషనల్ యానిమల్ రిసోర్స్ ఫెసిలిటీ ఫర్ బయో మెడికల్ రీసెర్చ్ కేవలం జంతువులకు నైతిక సంరక్షణ కల్పించడం మాత్రమే కాకుండా పరిశోధన సమయంలో నియంత్రణ చర్యలు కూడా అమలు చేస్తుంది. పరిశోధన సాగించే పరిశోధకులకు అవసరమైన సౌకర్యాలు అందించి వారి నైపుణ్య అభివృద్ధికి, కొత్తగా అభివృద్ధి చేసిన ఔషధాలు, వ్యాక్సిన్, వ్యాధి నిర్ధారణ అంశాలపై దేశంలో క్లినికల్ పరీక్షలు నిర్వహించడానికి, నూతన ఆవిష్కరణల నాణ్యత నిర్ధారించడానికి అవసరమైన సౌకర్యం అందిస్తుంది.

భారతదేశ మానవ వనరులు, మేధో సంపత్తి పై డాక్టర్ మాండవీయ ప్రశంసల జల్లు కురిపించారు. పరిశోధనా సంస్థలు, సాంకేతిక సంస్థలు, ఫార్మా లాంటి రంగాల్లో ఆవిష్కరణలు సాధించే అంశంలో భారతదేశం మొదటి నుంచి ముందు ఉంది అని డాక్టర్ మాండవీయ అన్నారు. ప్రపంచ ఫార్మా రంగంలో భారతదేశ ఫార్మా రంగం ప్రాధాన్యత వివరించిన డాక్టర్ మాండవీయ ' ప్రపంచంలో ఉత్పత్తి అవుతున్న నాలుగు మందుబిళ్లలో ఒక మందు బిళ్ళ భారతదేశం ఉత్పత్తి అవుతోంది. ప్రపంచంలో ఔషధ రంగంలో మాత్రమే కాకుండా ఫార్మా రంగంలో కూడా భారతదేశం అగ్రస్థానంలో నిలబడేలా చూడడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ లక్ష్యాన్ని సాధించడానికి దేశంలో క్లినికల్ పరీక్షలు నిర్వహించడానికి పటిష్టమైన వ్యవస్థ, జంతువుల సంరక్షణ అవసరం ఉంటుంది. లక్ష్య సాధన దిశలో ఎన్ఏఆర్ఎఫ్ బిఆర్ సహకరిస్తుంది' అని డాక్టర్ మాండవీయ వివరించారు.

దేశంలో పటిష్టమైన పరిశోధన, ఆవిష్కరణ రంగం ఉండాలని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఈ రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని డాక్టర్ మాండవీయ అన్నారు. విద్యా ప్రమాణాలు, పరిశోధన సౌకర్యాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చర్యలు అమలు చేస్తున్నదని అన్నారు. యువత తమ మేధస్సును దేశ సంక్షేమం, అభివృద్ధి కోసం వినియోగించడానికి అవసరమైన వాతావరణం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

ఐసీఎంఆర్ డైరెక్టర్ జనరల్, ఆరోగ్య పరిశోధన శాఖ కార్యదర్శి డాక్టర్ రాజీవ్ భల్ మాట్లాడుతూ నేషనల్ యానిమల్ రిసోర్స్ ఫెసిలిటీ ఫర్ బయో మెడికల్ రీసెర్చ్ దేశంలో మాత్రమే కాకుండా ప్రపంచంలో అత్యధిక ఆధునిక సౌకర్యాలు కలిగి ఉంటుందని తెలిపారు. నైతిక విలువలు పాటిస్తూ జంతువులపై పరిశోధనలు సాగించడానికి అవసరమైన సౌకర్యాలు సంస్థ కలిగి ఉంటుందని అన్నారు. జంతువుల ద్వారా సంక్రమించే వ్యాధులు అరికట్టడానికి సంస్థ ఉపయోగపడుతుందని అన్నారు.

# ఒకే రోజులో అత్యధికంగా 6,49,730 మెట్రిక్ టన్నుల సరుకును నిర్వహించి మరో మైలురాయిని సాధించిన పారాదీప్ పోర్ట్



న్యూఢిల్లీ, డిసెంబర్ 18:14 డిసెంబర్ 2022న, ఒకే రోజులో అత్యధికంగా 6,49,730 మెట్రిక్ టన్నుల కార్గో ట్రాఫిక్‌ను నిర్వహించిన పారాదీప్ పోర్ట్ మరో మైలురాయిని సాధించింది. అద్భుత పనితీరును కనబరిచిన పీపీఏ బృందాన్ని పీపీఏ ఛైర్మన్ శ్రీ పి.ఎల్.హరనాథ్ అభినందించారు. నిరంతర మద్దతు, అపారమైన సహకారం అందించిన సంబంధిత వర్గాల అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ఉత్తరం వైపున్న రేవులో పూడిక తీసిన తర్వాత, 1,46,554 టన్నుల కోకింగ్ బొగ్గును మోసుకెళ్లే 16.20 ఎంటీఆర్ నౌక ఎంవీ గోల్డెన్ బార్నెట్ పారాదీప్ పోర్టులోని కేఐసీటీ బెర్త్ వద్ద ఇటీవల విజయవంతంగా లంగరు వేసింది.ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 125 ఎంఎంటీల సరకు నిర్వహణ మైలురాయిని అందుకోవడానికి ఈ ఓడరేవు పోటీ పడుతున్నందున, మెరుగైన సామర్థ్యం ఉఆర్థిక ప్రయోజనాల కోసం నౌకాశ్రయంలోని నిర్వహణ సౌకర్యాలను ఉపయోగించుకోవాలని సంబంధిత వర్గాలను పారాదీప్ పోర్టు కోరింది.

# టీయూడబ్ల్యూజే యూనియన్ సభకు హాజరైన జర్నలిస్టులు

ఖమ్మం, డిసెంబర్ 18: (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం నగరం ఎస్ఆర్ గార్డెన్ నందు తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (టిజేఎఫ్ ) 3 వ జిల్లా మహాసభ కు జిల్లా నుండి నలు మూలల నుండి వివిధ పత్రికలు చానళ్ళు రిపోర్టర్లు హాజరైనారు. నేటీ నిజం ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో బండి కుమార్, బిసిఎన్ టీవీ దుబ్బాకుల శ్రీను, అక్షిత బ్యూరో ఖాసీం, సూపర్ టీవీ గుండు శ్రీను, రామధాస్ తదితురులు పాల్గోన్నారు.



## జ్యోతి ప్రజ్వలన చేసిన మంత్రి పువ్వాడ



ఖమ్మం, డిసెంబర్ 18: (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీజేఎఫ్) 3వ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం జర్నలిస్ట్ లను ఉద్దేశించి ప్రసంగించిన రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్.

కార్యక్రమంలో ఎంపి వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతామధు, ప్రెస్ అకాడెమి చైర్మన్ అల్లం నారాయణ, మేయర్ పునుకొల్లు నీరజ, యూనియన్ రాష్ట్ర నాయకులు రమేష్ హజారే, సంఘం జిల్లా అధ్యక్షుడు ఆదినారాయణ, ప్రజా పందా పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి పోటు రంగారావు తదితరులు ఉన్నారు.

## గాలి జనార్ధన రెడ్డి పార్టీ పేరు' కళ్యాణ రాజ్య ప్రగతి పక్ష?

అమరావతి డిసెంబర్ 18 (ఎక్స్ ప్రెస్ న్యూస్ )కర్ణాటక రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందు మాజీ మంత్రి గాలి జనార్ధన రెడ్డి తన సొంత పార్టీ ' కళ్యాణ రాజ్య ప్రగతి పక్ష (ఐఖీఖఖ)'ను ప్రారంభించనున్నట్లు తేలడంతో కర్ణాటకలో సందడి నెలకొంది. పార్టీ గుర్తు రిజిస్టర్ కోసం ఆయన ప్రస్తుతం న్యూఢిల్లీలో ఉన్నట్లు ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి. కొత్త పార్టీ కోసం ఈసీకి గాలి తరుపున దరఖాస్తు చేశారు. గాలికి అత్యంత సన్నిహితుడు గతంలో బుడా చైర్మన్ గా పనిచేసిన కురుబ కులం నేతను దీనికి అధ్యక్షుడిగా పెట్టబోతున్నట్టు సమాచారం. తన రాజకీయ కొత్త పార్టీని ప్రకటించేందుకు కొప్పల్ జిల్లాలోని గంగావతిలో మెగా ర్యాలీ నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. అయితే కొత్త పార్టీ పెట్టే విషయమై ఇప్పటి వరకు 'గాలి' ఎలాంటి ప్రకటన చేయలేదు.జనార్ధన్ రెడ్డి గంగావతి నుంచి ఆయన భార్య అరుణారెడ్డి గడగ్ జిల్లా నుంచి పోటీ చేస్తారని భావిస్తున్నారు. కాంగ్రెస్ బీజేపీల నుంచి అసంతృప్తిగా ఉన్న నేతలను తమ పార్టీకి మద్దతిచ్చి ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆహ్వానించాలని ఆయన యోచిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఆయన పార్టీ కనీసం 25 నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తుందని వారు తెలిపారు. "గాలికి 10కి పైగా అసెంబ్లీ స్థానాల్లో బలమైన కోట ఉంది. చాలా సీట్లు గెలుచుకునే సామర్థ్యం ఉంది" అని అతని అనుచరుడు చెప్పారు.

బళ్లారి విజయనగరం కొప్పల్ రాయచూర్ యాదగిరి బీదర్ జిల్లాల్లో గాలి జనార్ధన్ రెడ్డికి భారీ సంఖ్యలో మద్దతుదారులు ఉన్నారు. గత కొన్నేళ్లుగా రాజకీయాలకు దూరంగా ఉన్న ఆయన.. పోటీ చేసేందుకు అనుమతించాలంటూ ఇటీవల బీజేపీని సంప్రదించగా ఎలాంటి స్పందన రాలేదని సమాచారం.రెడ్డి తన పార్టీని ప్రారంభిస్తే బిజెపి తన ఓట్ల వాటా ఓట్లను కోల్పోయే అవకాశం ఉన్నందున కమలం పార్టీ చాలా ఆందోళన చెందుతుంది. 2013లో బి.ఎస్. యడియూరప్ప బిజెపిని విడిచిపెట్టి కర్ణాటక జనతా పార్టీని వీడినప్పుడు గాలి జనార్ధన్ రెడ్డి సోదరులు ప్రస్తుత మంత్రి బి. శ్రీరాములు సహాయంతో బి.ఎస్.ఆర్. కాంగ్రెస్ని స్థాపించినప్పుడు కమలం పార్టీ ఇదే పరిస్థితిని ఎదుర్కొంది. ఆ ఏడాది జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్కు ఇది లాభదాయకంగా మారింది.అయితే బీజేపీకి చెందిన బళ్లారి ఎమ్మెల్యే జనార్ధనరెడ్డి సోదరుడు జి సోమశేఖర రెడ్డి కొత్త పార్టీ పెట్టే ప్రసక్తే లేదని కొట్టిపారేశారు. నా సోదరుడు బీజేపీని వీడడు కొత్త పార్టీ పెట్టడు అని క్లారిటీ ఇచ్చారు.రెడ్డి కొత్త పార్టీ పెట్టకపోవచ్చని అయితే బీజేపీపై ఒత్తిడి తెచ్చి ఆ పార్టీ నుంచి మళ్లీ పోటీ చేసేందుకు అనుమతించేందుకే ఈ వార్తలను ప్రచారం చేస్తున్నారని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. "గాలి జనార్ధన్ రెడ్డి ఆశ్చర్యాలకు ప్రసిద్ధి. కొత్త పార్టీని రెడ్డి ధృవీకరించకపోతే ఏమీ చెప్పలేము "అని ఆయన సన్నిహితులు తెలిపారు.ఇక గాలి జనార్ధన్ రెడ్డి బీజేపీ లైట్ తీసుకుంటోంది. ఇప్పటికే అవినీతి ఆరోపణలతో జైలుకు వెళ్లివచ్చిన గాలి జనార్ధన్ రెడ్డిని బీజేపీ సైతం దూరంగా పెడుతోంది. ఆయన వల్ల పార్టీకి నెగెటివ్ వస్తోందని మౌనం వహిస్తోంది. అందుకే బీజేపీ వదిలేయడంతోనే కొత్త పార్టీతో గాలి వస్తున్నట్టు సమాచారం. ఇక మరి కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన కేసీఆర్ 'బీఆర్ఎస్'తో గాలి జనార్ధన్ రెడ్డి కలుస్తారా? జేడీఎస్ గాలితో కలిసి తెలుగు వారుండే చోట కేసీఆర్ పోటీచేయాలని చూస్తున్నట్టు సమాచారం.

## ఎవరొచ్చినా పార్టీ జెండా గద్దె నిర్మాణం ఆపేది లేదు : ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

వరంగల్, డిసెంబర్ 18:బహుజన సమాజ్ పార్టీ జెండా గద్దె నిర్మాణాన్ని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ దగ్గరుండి చేపట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి? మానకొండూరు మండల కేంద్రంలో చెరువు కట్ట వద్ద అంబేద్కర్ విగ్రహం పక్కన నిర్మాణం చేయించిన జెండా గద్దెను శుక్రవారం అర్ధరాత్రి కూల్చివేసిన విషయం విధితమే.. కాగా శనివారం మండలంలోని వివిధ గ్రామాలలో బహుజన రాజ్యాధికార యాత్ర నిర్వహించిన అనంతరం సుమారు అర్ధరాత్రి రెండు గంటల వరకు కూల్చివేసిన స్థలంలోనే జెండా గద్దెను నిర్మాణం చేపట్టారు. నిర్మాణం చేపడుతున్న స్థలానికి పోలీసులు వచ్చి గద్దె నిర్మానానికి అనుమతులు లేవని నిర్మాణం ఆపాలన్నారు. ఇతర పార్టీల జండా గద్దెలకు ఎవరు పర్మిషన్ ఇచ్చారని వారికి అనుమతులు ఉన్నాయా అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పోలీసులను ప్రశ్నించారు. ఆ పార్టీల జెండా గద్దలకు పర్మిషన్లు ఉంటే తీసుకురమ్మని, అప్పుడు తను చేస్తున్న జండా గద్దె నిర్మాణం ఆపేస్తానని పోలీసులతో చెప్పారు. ఎమ్మెల్యే రసమయి వచ్చిన, సీఎం కేసీఆర్ వచ్చిన జండా గద్దె నిర్మాణం పూర్తయ్యేంత వరకు ఇక్కడ నుండి వెళ్లేది లేదని ఆర్ఎస్ పి పోలీసులతో చెప్పడంతో వారు అక్కడి నుండి వెళ్ళిపోయారు.

# ఇండో-యూకే వర్క్‌షాప్ రెండు దేశాల పర్యావరణ లక్ష్యాల పట్ల నిబద్ధతను హైలైట్ చేస్తుంది

న్యూఢిల్లీ, డిసెంబర్ 18:డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీఎస్టీ) సెక్రటరీ డాక్టర్ శ్రీవారి చంద్రశేఖర్, పర్యావరణ లక్ష్యాల పట్ల భారతదేశం నిబద్ధతను నొక్కి చెప్పారు. ఇందులో పర్యావరణ కాలుష్యం కోసం ఉపశమన ఉ పర్యవేక్షణ పరిష్కారాల అభివృద్ధికి స్థిరమైన ప్రయత్నాలు కర్బన ఉద్గారాలను తగ్గించడానికి సాంకేతిక ఆధారిత మార్గాలు ఉన్నాయి. నిన్న జరిగిన తక్కువ-ధర పర్యావరణ సెన్సార్‌లపై ఇండో-యూకే స్కోపింగ్ వర్క్‌షాప్‌లో నున్నా లక్ష్యాల కార్యక్రమం జరిగింది. వర్క్‌షాప్ ప్రారంభోత్సవంలో కార్బన్ క్యాప్చర్ యుటిలైజేషన్ స్టోరేజ్ (సీసీయూఎస్) పట్ల డీఎస్టీ సహకారాన్ని హైలైట్ చేస్తూ, డీఎస్టీ సీసీయూఎస్లో ఆర్‌డీడీ కెపాసిటీ బిల్డింగ్‌ను అభివృద్ధి చేయడంలో చురుకుగా నిమగ్నమైందని ఇండియన్ సీఓ2 సీక్వెస్ట్రియన్ అప్లైడ్ రీసెర్చ్ (ఐసీఓఎస్ఏఆర్) నెట్‌వర్క్‌ను స్థాపించిందని అన్నారు. పర్యావరణ సెన్సార్ల ప్రాంతంలో భారతదేశం, యూకేలోని అకడమిక్ కమ్యూనిటీల మధ్య సహకారాన్ని పెంపొందించడానికి పరిశోధన స్టార్ట్-అప్‌ల కోసం ఖాళీలు అవకాశాలను గుర్తించడానికి డీఎస్టీ యూకేఆర్ఐ/ఎన్ఈఆర్సీసంయుక్తంగా రెండు రోజుల వర్క్‌షాప్‌ను 2022 డిసెంబర్ 14 నుండి 15 వరకు నిర్వహించాయి.

సెన్సార్‌లపై వర్క్‌షాప్ నిర్వహించబడిన క్లీన్ వాటర్‌పై ఉమ్మడి ఇండియా యూకే కార్యక్రమం గురించి మాట్లాడుతూ, డాక్టర్ చంద్రశేఖర్, "డీఎస్టీ, నేచురల్ ఎన్విరాన్‌మెంట్ రీసెర్చ్ కౌన్సిల్ (ఎన్ఈఆర్సీ) యూకే ఇంజనీరింగ్ ఫిజికల్ సైన్సెస్ రీసెర్చ్ కౌన్సిల్ (ఈపీఎస్ఆర్సీ) ఉమ్మడి కార్యక్రమం. ) యూకేఆర్ఐ, రెండు దేశాలలో ఉద్భవిస్తున్న కాలుష్య కారకాల మూలాలు విధి గురించి మెరుగైన అవగాహనను అందించడం ద్వారా నీటి నాణ్యతను మెరుగుపరచడం తక్కువ-ధర పర్యావరణ పర్యవేక్షణ సెన్సార్ల (లెమ్స్) అభివృద్ధి ద్వారా నిర్వహణ వ్యూహాలకు మద్దతు ఇవ్వడం లక్ష్యంగా పెట్టుకుంది. కార్యక్రమంలో, డాక్టర్ చంద్రశేఖర్ భారతదేశంలోని బ్రిటిష్ హైకమిషనర్ అలెగ్జాండర్ ఎల్లిస్ తక్కువ-ధర పర్యావరణ సెన్సార్లు కార్బన్ క్యాప్చర్ యుటిలైజేషన్ స్టోరేజ్ (సీసీయూఎస్)పై రెండు ఇండో-యూకే స్కోపింగ్ నివేదికలను విడుదల చేశారు. "డీఎస్టీ యూకేఆర్ఐ సంయుక్తంగా ఇప్పటికే ఉన్న పరిశోధనా ల్యాండ్‌స్కేప్‌ను మ్యాపింగ్ చేయడంలో పనిచేశాయి. పర్యావరణ సెన్సార్‌లపై ఈ ఇండో-యూకే నివేదిక భారతదేశం యూకే సంయుక్తంగా ప్రారంభించిన మ్యాపింగ్ కార్యాచరణ ఫలితం. ఇది భారతదేశం యూకేలోని పర్యావరణ సెన్సార్‌లలో ఇప్పటికే ఉన్న కొనసాగుతున్న పరిశోధనా ల్యాండ్‌స్కేప్‌ను ప్లాట్ చేస్తుంది ద్వైపాక్షిక సహకారం కోసం అవకాశాలను గుర్తించడానికి ప్రయత్నిస్తుంది, "అని డాక్టర్ చంద్రశేఖర్ చెప్పారు. "సీసీయూఎస్పై ఈ ఇండో-యూకే స్కోపింగ్ నివేదిక ఈ డొమైన్‌లోని పరిశోధన అభివృద్ధిని అర్థం చేసుకోవడానికి రెండు దేశాలలో పరిపూరకరమైన బలాలు అంతరాలను గుర్తించడానికి భారతదేశం యూకే మధ్య సహకారం ఫలితం" అని ఆయన తెలిపారు. సీసీయూఎస్పై దృష్టి సారించే ఇన్నోవేషన్ ఛాలెంజ్ ఐసీ3పై సహకార పరిశోధన, అభివృద్ధి ప్రదర్శన (ఆర్డీడీ) కోసం యూకేతో సహా ఇతర 21 సభ్య దేశాలతో పాటు భారతదేశం అంతర్జాతీయ ఎంఐ ప్లాట్‌ఫారమ్‌లో భాగమైందని కూడా ఆయన వివరించారు. డీఎస్టీ భారతదేశం, యూకే ఇతర యాక్ట్ సభ్య దేశాలు కూడా అత్యుత్తమ ప్రపంచ పద్ధతులను అవలంబించడం కోసం బహుపాక్షిక యాక్సిలరేటింగ్ సీసీయూఎస్ టెక్నాలజీస్ (యాక్ట్) ప్లాట్‌ఫామ్‌లో పాల్గొంటున్నాయి" అని డాక్టర్ ఎస్ చంద్రశేఖర్ విశదీకరించారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు వాతావరణ మార్పులే తమ సహకారానికి ప్రాథమిక మూల స్తంభాలు అని గత ఏడాది భారత్ యూకే రెండూ అంగీకరించాయని భారతదేశంలోని బ్రిటిష్ హైకమిషనర్ అలెగ్జాండర్ ఎల్లిస్ తెలిపారు. "వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి, మాకు విధానం చర్యల కోసం తగిన డేటా అవసరం అలాగే తగిన నిర్వహణ విధానాలను అవలంబించాలి. కాబట్టి, తక్కువ ఖర్చుతో కూడిన పర్యావరణ పర్యవేక్షణ సెన్సార్లు ఈ సమయంలో అవసరం, " అని అన్నారాయన. డీఎస్టీ యూకేఆర్ఐ / ఎన్ఈఆర్సీ/ ఈపీఎస్ఆర్సీ అధికారులు, ఇరువైపుల డొమైన్ నిపుణులతో పాటు పర్యావరణ సెన్సార్‌లపై స్కోపింగ్ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు.

## క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం : ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



మెదక్, డిసెంబర్ 18: నేటినిజం ప్రతినిధి):విద్యార్థి దశ నుండి చదువుతోపాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత అందించాలని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి కోరారు. పటాన్ చెరు డివిజన్ పరిధిలోని మైనార్టీ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన ఫిట్నెస్ ఆఫ్ తెలంగాణ, పటాన్ చెరు మండలం భానూరు గ్రామంలో మహావీర్ మార్షల్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రాష్ట్రస్థాయి ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్లను ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం, శారీరాక దారుఢ్యం లభిస్తుందని తెలిపారు. పటాన్చెరు నియోజకవర్గంలో క్రీడా పోటీల నిర్వహణకు సంపూర్ణ సహకారం అందించడంతోపాటు ప్రభుత్వం తరఫున క్రీడా పోటీలో నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనబోయే నియోజకవర్గ క్రీడాకారులకు ఆర్థిక సహకారం అందిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే నియోజకవర్గం వ్యాప్తంగా మూడు మినీ స్టేడియాల నిర్మాణ పనులు ప్రారంభించామని గుర్తు చేశారు. రెండు క్రీడా పోటీల నిర్వహణకు ఎమ్మెల్యే జీఎంఆర్ 3 లక్షల రూపాయల సొంత నిధులను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, ఎంపీపీ సుష్మాశ్రీ వేణుగోపాల్ రెడ్డి, పటాన్చెరు కార్పోరేటర్ మెట్టు కుమార్ యాదవ్, భానురు సిఐ వినాయక్ రెడ్డి, బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు దశరథ రెడ్డి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## భారత నావికాదళంలోకి జలప్రవేశం చేసిన ఐఎన్ ఎస్ మొర్ముగోవా యుద్ధనౌక



న్యూఢిల్లీ, డిసెంబర్ 18:ఐఎన్ఎస్ మొర్ముగోవా యుద్ధనౌక భారత నావికాదళంలోకి ఆదివారంనాడు ప్రవేశించింది. ఇండియన్ నేవీ అంతర్గత సంస్థ అయిన వార్ షిప్ డిజైన్ బ్యూరో చేత ఈ నౌక డిజైన్ చేశారు. మజాగాన్ డాక్‌షిప్ బిల్డర్స్ చేత ఈ నౌకను నిర్మించారు. ఈ నౌకను స్వదేశీ ఉక్కు డీఎంఆర్ 249 ఏ ఉపయోగించి తయారు చేశారు. ఐఎన్ఎస్ మొర్ముగోవా యుద్ధనౌకను నేడు జల ప్రవేశం చేసింది.ముంబైలో జరిగిన కార్యక్రమంలో ఈ యుద్ధనౌక జలప్రవేశం చేసిన కార్యక్రమంలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ పాల్గొన్నారు. ఐఎన్ఎస్ మొర్ముగోవా యుద్ధనౌక రెండవ స్టెల్త్ గైడెడ్ క్షిపణి విధ్వంసక నౌక. గత ఏడాది నవంబర్ 21న ఐఎన్ఎస్ విశాఖపట్టణం జల ప్రవేశం చేసింది. గోవా రాష్ట్రానికి చెందిన మొర్ముగోవా పేరును ఈ నౌకను పెట్టారు.. ఈ నౌక 163 మమీటర్ల పొడవు, 17 మీటర్ల వెడల్పు కలిగి ఉంటుంది. 7,400 టన్నుల బరువును ఈ నౌక మోసుకెళ్లనుంది. ఈ నౌక వేగం 30 నాట్స్ గా అధికారులు చెబుతున్నారు.

## కొమురవెల్లి మల్లన్న స్వామికి ప్రభుత్వం తరపున రూ.కోటి విలువైన బంగారు కిరీటం



హైదరాబాద్, డిసెంబర్ 18:కొమురవెల్లి మల్లన్న స్వామికి ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలతో పాటు రూ.కోటి విలువైన బంగారు కిరీటాన్ని సమర్పించారు మంత్రి హరీశ్ రావు. కాగా కొమురవెల్లి మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవంలో మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, మల్లారెడ్డి, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. కొందరు ఎన్ని కుట్రలు చేసిన మల్లన్న దయతో మల్లన్న సాగర్ అనుకున్న సమయానికి పూర్తి చేసుకున్నాం. మల్లన్న దేవుడి దయతో, సీఎం కేసీఆర్ కృషితో మూడేళ్లలో మల్లన్న సాగర్ పూర్తి చేసుకుని పలు జిల్లాలకు సాగునీటితో సస్యశ్యామలం చేయడం జరుగుతున్నదని తెలిపారు.

మల్లన్న సాగర్ ప్రారంభం చేసి గోదావరి జలాలతో సీఎం కేసీఆర్ మల్లన్న పాదాలు కడిగి మొక్కులు తీర్చుకున్నారని హరీశ్ రావు తెలిపారు.కొమురవెల్లి మల్లన్న మన కొంగు బంగారమని, రాష్ట్రానికే తలమానికం మల్లన్న జాతర అని పేర్కొన్నారు. ఇవాళ మల్లన్న స్వామివారి కల్యాణం వైభవంగా జరగడం, స్వామివారికి బంగారు కిరీట ధారణ చేయడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ ఆలయాలకు నిధులు మంజూరు చేస్తూ.. పురాతన ఆలయాలకు పూర్వ వైభవం తెస్తున్నారని మంత్రి వెల్లడించారు. కొమురవెల్లి మల్లన్న ఆలయ అభివృద్ధికై రూ. 30 కోట్లు కేటాయించారని గుర్తు చేశారు. ఇప్పటికే సీఎం కేసీఆర్ మల్లన్న స్వామివారిని రెండుసార్లు దర్శించుకున్నారు. వచ్చే ఏడాది మల్లన్న స్వామి కల్యాణం వరకు కేతమ్మ, మేడమ్మల అమ్మవార్లకు ఒక కిలో స్వర్ణ కిరీటం తయారు చేయిస్తామని మంత్రి ప్రకటించారు.

## ఇంటింటికి ప్రచారాన్ని నిర్వహించిన ఏనుగు మనోహర్ రెడ్డి



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 18: (నేటినిజం ప్రతినిధి): సెస్ ఎన్నికలలో బాగంగా వేములవాడ రూరల్ మండలంలోని జయవరం, మర్రి పెల్లి,గ్రామాలలో బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన రూరల్ అభ్యర్థి "ఆకుల దేవరాజం" బీరువగుర్తుకు ఓటు వేయాలని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, బి ఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి కలిసిఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏనుగు మనోహర్ రెడ్డి మాట్లాడుతూ సెస్ వినియోగదారుల విద్యుత్ సమస్యలు పరిష్కారం కావాలంటే బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తేనే సాధ్యమవుతుందనిఅన్నారు. ఎన్నికల ప్రచారంలోసర్పంచుల ఫోరం అధ్యక్షులు ఏష తిరుపతి,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డం హన్మాండ్లు,మండల పార్టీ అధ్యక్షులు గోస్కుల రవి ,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెల్మ బాల్ రెడ్డి, సర్పంచులు కట్కం మల్లేశం ,మల్లారం తిరుపతి,ఎంపీటీసీ పండుగ తిరుపతి,,ఉప సర్పంచు జంకే మధు, పసుల అంజి, తీగల దేవరాజం ,నాగరాజు,పిట్టల వెంకటేశం,రవి లచ్చిరెడ్డి, నర్సయ్య, మహేష్, ప్రవీణ్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరికలు : ఎమ్మెల్యే గాదరి కిశోర్

హైదరాబాద్, డిసెంబర్ 18:తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ తెలిపారు. తుంగతుర్తి మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

ఈ సందర్భంగా వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని అన్నారు. అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని నాయకులను, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని తెలిపారు. పార్టీలో చేరిన కుటుంబాలకు అందుబాటులో ఉంటానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, స్థానిక సర్పంచ్ నకరికంటి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పువ్వాడకు కృతజ్ఞతలు తెలిపిన వ్యాపారులు



ఖమ్మం, డిసెంబర్ 18: (నేటినిజం ప్రతినిధి): రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆదేశాల మేరకు నగర ప్రజల సౌకర్యార్థం పూర్తి సిటీ సర్వీసులు మరియు పల్లెవెలుగు సర్వీసులు పునరుద్దరీకరించిన మేరకు స్థానిక వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయా వ్యాపారులు చైన్ సింగ్ అధ్వర్యంలో ఆదివారం వీడియో'న్ కాలనిలోని మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కి అధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఇప్పటికే వ్యాపారాలు తగ్గి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న వ్యాపారులకు పాత బస్ స్టాండ్ నుండి సిటి సర్వీసులు ప్రారంభించడం శుభపరిణామం అని వారు అన్నారు. ఈ నిర్ణయంతో తమ వ్యాపారాలు మెరుగుపడతాయని, స్థానిక వ్యాపారులు మంత్రి పువ్వాడకు రుణపడి ఉంటామని పేర్కొన్నారు.

వ్యాపారాలలో పాటు ముఖ్యంగా చుట్టు పక్కల గ్రామాల, జిల్లా వ్యాప్తంగా ఖమ్మం జిల్లా కేంద్రంకు వచ్చే రోగులు, విద్యార్థులు, ఉద్యోగులు, చిరు వ్యాపారులు, నగర ప్రజల సౌకర్యార్థం పాత బస్ స్టాండ్ ను అందుబాటులోకి తెచ్చామని మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ వివరించారు.

ఖమ్మం పాత బస్ స్టాండ్ కు పూర్వ వైభవం తెస్తామని ప్రజలు ప్రజా రవాణా సౌకర్యాలను వినియోగించుకోవాలని కోరారు. మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ విజయ్, బెరాస టౌన్ ప్రెసిడెంట్ పగడాల నాగరాజు తదితరులు ఉన్నారు.

## మద్యం మత్తులో డ్రైవర్.. చిన్నారులపై దూసుకెళ్లిన కారు

న్యూఢిల్లీ, డిసెంబర్ 18: ఓ డ్రైవర్ మద్యం మత్తులో కారును అతి వేగంగా నడిపాడు. కారు అదుపుతప్పి ఓ ముగ్గురు పిల్లలపైకి దూసుకెళ్లింది. దీంతో చిన్నారులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఢిల్లీలోని గులాబీ బాగ్‌లో ఇవాళ ఉదయం చోటు చేసుకుంది.

ఢిల్లీలోని గులాబీ బాగ్‌లో ఓ 30 ఏండ్ల యువకుడు తన మారుతి బ్రీజా కారులో వేగంగా వెళ్తున్నాడు. అంతలోనే కారు అదుపుతప్పి ఫుట్‌పాత్‌పైకి దూసుకెళ్లింది. ఆ ఫుట్‌పాత్‌పై ఉన్న ముగ్గురు పిల్లలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదానికి కొంచెం దూరంలో కారును ఆపిన యువకుడిని స్థానికులు అదుపులోకి తీసుకున్నారు. కారు డ్రైవర్‌ను స్థానికులు చితకబాది, అనంతరం పోలీసులకు అప్పగించారు. గాయపడ్డ చిన్నారులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. 10, 4 ఏండ్ల వయసున్న ఇద్దరు పిల్లలకు స్వల్ప గాయాలు కాగా, 6 ఏండ్ల వయసున్న మరో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి.కారు డ్రైవర్‌ను ప్రతాప్‌నగర్‌కు చెందిన గజేందర్‌గా పోలీసులు గుర్తించారు. అయితే అంతకు ముందు కూడా గజేందర్ వేగంగా కారు నడిపినట్లు స్థానికులు పేర్కొన్నారు. మెల్లగా నడపాలని హెచ్చరించిన ప్తుటికీ అతను వినిపించుకోలేదన్నారు.




# సంఘటితంతోనే సమస్యలు పరిష్కారం : మంత్రి గంగుల కమలాకర్



కరీంనగర్, డిసెంబర్ 18(నేటినిజం ప్రతినిధి): కలిసి ఉంటే కలదు సుఖం అన్నట్లు సంఘంలోని వ్యక్తులందరూ కలిసి ఉంటే సమస్యలు పరిష్కారమవుతాయని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్ మున్నూరు కాపు ఉద్యోగ విశ్రాంతి ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా శాఖ నూతన కార్యవర్గ సభ్యులు ఆదివారం మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్నూరు కాపులు సమాజంలోని వివిధ రంగాల్లో ఉద్యోగులుగా రాణిస్తూ సమాజాభివృద్ధికి కృషి చేస్తున్నారని ప్రశంసించారు. సంఘటితంగా ఉండడం వల్ల సమాజానికి కూడాఉపయోగం ఉంటుందని అభిప్రాయపడ్డారు. సంఘం అభివృద్ధికి సహకారం అందిస్తానని అన్నారు. మంత్రిని కలిసిన వారిలో జిల్లా అధ్యక్షులు వీర బుచ్చయ్య, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మామిడి రమేష్ పటేల్, జిల్లా ప్రధాన కార్యదర్శి కామ సతీష్ పటేల్, కోశాధికారి బట్టు కరుణాకర్ పటేల్, సహాధ్యక్షులు గాదె నాగులు పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# దుకాణాల తొలగింపును నిరసిస్తూ వ్యాపారుల నిరసన

అమరావతి డిసెంబర్ 18: శ్రీశైలం దేవాలయానికి ఇరువైపుల ఉన్న దుకాణాల తొలగింపును నిరసిస్తూ వ్యాపారులు ఆదివారం నిరసన తెలియజేశారు. ఆలయం వద్ద ఉన్న పాత దుకాణాలను కొత్తగా నిర్మించిన లలితాంబికా సముదాయంలోకి తరలించాలని అధికారులు వ్యాపారులకు పలుమార్లు విజ్ఞప్తి చేశారు. వ్యాపారులకు కేటాయించిన దుకాణాల్లోకి ఈనెల 15 వ తేదీలోపు మారిపోవాలని సూచించారు.

ఇందులో భాగంగా ఆదివారం అధికారులు జేసీబీ యంత్రాలు, లారీ, ట్రాక్టర్లతో పాత భవనాల సముదాయల వద్దకు తీసుకురాగా వ్యాపారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. వారివారి దుకాణాల ఎదుట బైటాయించి నిరసన తెలిపారు. ఏపీ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల ప్రకారం ఈనెల 3వ తేదీన మొత్తం 125 మంది వ్యాపారులకు లక్కీ డిప్ నిర్వహించి లలితాంబికా సముదాయంలో దుకాణాలు కేటాయించారు.

అయితే కొత్త సముదాయంలో వ్యాపారాలు నిర్వహించడానికి వసతులు లేవని వ్యాపారులు ఆరోపిస్తూ నిరసన తెలిపారు. దీంతో పోలీసులు ఆలయ పరిసరాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

# 175సీట్లు మావే.. జగన్ పాలనతో రాష్ట్రం బాగుపడిందన్న మంత్రి రోజా

అమరావతి డిసెంబర్ 18:రాష్ట్రంలోని అన్ని వర్గాలను సంక్షేమ పథకాలతో జగన్ సర్కారు ఆదుకుంటోందని చెప్పారు మంత్రి రోజా. వచ్చే ఎన్నికల్లో 175సీట్లు తమవేనని జోస్యం చెప్పారు. ఆదివారం లంబసింగి పర్యటనకు వెళ్తూ అనకాపల్లి జిల్లాలో మంత్రి రోజా మీడియాతో మాట్లాడారు.

తాము అధికారంలోకి రాగానే.. జగన్ సర్కారు తెచ్చిన సంక్షేమ పథకాలను, వాలంటీర్లు, సచివాలయ వ్యవస్థలను రద్దు చేస్తామని గతంలో టీడీపీ ప్రకటించిందని మంత్రి రోజా గుర్తుచేశారు. ఇప్పుడు మాటమార్చి, సచివాలయ ఉద్యోగులను కొనసాగిస్తామని టీడీపీ నేతలు చెబుతున్నారని రోజా విమర్శించారు.

టీడీపీ నేతలు రోజుకో మాట మాట్లాడుతున్నారని మంత్రి విమర్శించారు. జగన్ పాలనతో రాష్ట్రం బాగుపడిందని, అభివృద్ధివైపు పరుగులు పెడుతోందని జనం నమ్ముతున్నారని మంత్రి చెప్పారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని మంత్రి రోజా చెప్పారు.

రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేస్తామని టూరిజం మినిస్టర్ రోజా చెప్పారు. కరోనా తగ్గుముఖం పట్టాక రాష్ట్రంలో టూరిజం పుంజుకుందని, టెంపుల్ టూరిజంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో ఉందని చెప్పారు.

టూరిస్టు ప్రాంతాల్లో వసతుల కల్పన కోసం ప్రైవేటు భాగస్వామ్యంతో పనిచేస్తున్నామని వివరించారు. స్వదేశీ దర్శన్, ప్రసాద పథకాలలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాకు నాలుగు ప్రాజెక్టులు మంజూరు అయ్యాయని మంత్రి రోజా చెప్పారు.




తెలంగాణ రచయితల సంఘం

**ఆహ్వానం**

24.12.2022 శనివారం మధ్యాహ్నం 1.30 గంటలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రం మొదటి అంతస్తు హాలు, బాగ్ లింగంపల్లి, హైదరాబాదు.

**తెలుగుభాష - ఆధిపత్యాలు సదస్సు**

ఆహ్వానం : కందుకూరి శ్రీరాములు
తెరసం జంట నగరాల శాఖాధ్యక్షులు

అధ్యక్షత : డా. నాళేశ్వరం శంకరం
తెరసం రాష్ట్ర అధ్యక్షులు

ప్రస్తావన : డా. వి. శంకర్
తెరసం రాష్ట్రప్రధాన కార్యదర్శి

ప్రసంగాలు :
1. తెలుగుభాష-సాహిత్య ప్రభావం
ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి
ప్రముఖ సాహిత్య విమర్శకులు
2. తెలుగు-వివిధ భాషలు-ఆధిపత్యాలు
డా. నలిమెల భాస్కర్
ప్రముఖ భాషావేత్త
3. తెలుగుభాష-ప్రసార మాధ్యమాలు-ప్రభావాలు
డా. కె. శ్రీనివాస్
సంపాదకులు, ఆంధ్రజ్యోతి
4. భాషాధిపత్యాలు-ఉద్యమాలు-తెలుగు
డా. నందిని సిధారెడ్డి
ప్రముఖ కవి

మీరు తప్పక రావాలని మనవి.
--- తెలంగాణ రచయితల సంఘం


# నిరుపేదల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ : ఎమ్మెల్యే దాసరి



కరీంనగర్, డిసెంబర్ 18(నేటినిజం ప్రతినిధి): అనారోగ్యాల బారిన పడి ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన పెద్దపల్లి నియోజకవర్గం లోని 123 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన 55,25,500 రూపాయల చెక్కులను ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఆదివారం లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ నిరుపేదల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని గత నాలుగెల్లుగా వేలాది మందికి కోట్లాది రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పొరేట్ వైద్యం అందాల ఆసుపత్రులను బలోపేతం చేస్తున్నామని, ఆధునిక సౌకర్యాలు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. గర్భిణీలకు సౌకర్యంగా ఉండేలా మాతా శిశు కేంద్రాలను ప్రభుత్వం ప్రారంభిస్తుందని, కెసిఆర్ కిట్ పథకం ప్రారంభమైన అనంతరం ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాల సంఖ్య పది రేట్లు అయిందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన జడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపిటీసీలు, ప్రజాప్రతినిధులతో పాటు నాయకులు పాల్గొన్నారు.

# రేవంత్ వెనకే కాంగ్రెస్ హై కమాండ్...సీనియర్లకు క్లాస్..?

హైదరాబాద్ డిసెంబర్ 18 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తెలంగాణా కాంగ్రెస్ లో లొల్లి స్టార్ట్ అయింది. పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి వర్సెస్ సీనియర్లుగా ఇపుడు రాజకీయ కథ సాగుతోంది. రేవంత్ రెడ్డితో కలసి పనిచేయలేమన్న స్టేజికి సీనియర్ లీడర్లు చాలా మంది వెళ్లిపోయారు. రేవంత్ రెడ్డి అంటే మొదటి నుంచి గిట్టని జగ్గారెడ్డి కోమటి రెడ్డి వెంకటరెడ్డి లతో పాటు ఇపుడు అంతా బయటపడిపోయారు. రేవంత్ తో కలసి పనిచేస్తున్న సీఎల్పీ లీడర్ మల్లు భట్టి విక్రమార్క సైతం ఇపుడు సీనియర్ల క్యాంప్ లో ఉన్నారు.అలాగే మాజీ మంత్రులు గీతారెడ్డి దామోదర రాజనర్సింహా మజీ పీసీసీ చీఫ్ ఉత్తం కుమార్ రెడ్డి మధు యాష్కీ వంటి వారు అంతా రేవంత్ రెడ్డి కాదు మాదే ఒరిజినల్ కాంగ్రెస్ అని చెప్పుకుంటున్నారు. ఇక వీరంతా వరసబెట్టి సమావేశాలు నిర్వహిస్తూ మీడియాకు ఎక్కుతున్నారు. దాంతో కాంగ్రెస్ హై కమాండ్ సీరియస్ గా ఉంది అని అంటున్నారు.

పార్టీలో విభేదాలు ఉంటే తమతో వచ్చి చెప్పాలి కానీ మీడియాతో పంచుకోవడమేంటన్నది హైకమాండ్ అభిప్రాయంగా ఉంది. దాంతో సీనియర్లను మాట్లాడేందుకు రావాలని ఢిల్లీకి హై కమాండ్ పిలిచినట్లుగా తెలుస్తోంది. అదే సమయంలో తప్పు ఎవరిది అన్నది కూడా హై కమాండ్ ఆరా తీసేందుకు ఒక నివేదికను కూడా పార్టీ నాయకుడు కేసీ వేణుగోపాల్ ద్వారా కోరుతున్నట్లుగా తెలుస్తోంది. మరో వైపు చూస్తే ఢిల్లీ నుంచి కాంగ్రెస్ తరఫున ఏఐసీసీ కార్యదర్శులు కొంతమంది హైదరాబాద్ కి రానున్నారు అని అంటున్నారు. వారంతా అసలు వివాదం ఎక్కడ నుంచి మొదలైంది. దానికి దారి తీసిన కారణాలు ఏంటి అన్నది పూర్తిగా పరిశీలించి ఒక నివేదికను తయారు చేసి ఇస్తారని అంటున్నారు. మరో వైపు చూస్తే కాంగ్రెస్ హై కమాండ్ నుంచి పిలుపు వచ్చిందని ప్రచారం జరుగుతున్నా కూడా సీనియర్లు ఎక్కడా తగ్గేది లేదనే అంటున్నారుఇక ఈ నెల 29న మరో కాంగ్రెస్ నేత ఏలేటి మహేశ్వర రెడ్డి ఇంట్లో కాంగ్రెస్ సీనియర్లు ఇంకోసారి భేటీ అయి తమ భవిష్యత్తు కార్యాచరణను సిద్ధం చేసుకుంటారని అంటున్నారు. మరి ఈ భేటీలో ఏమైనా ఢిల్లీ వెళ్ళే విషయం ఆలోచిస్తారా. ఢిల్లీ వెళ్తే కాంగ్రెస్ పెద్దలకు ఏమి చెప్పాలన్నది చర్చిస్తారా అన్నది తేలాల్సి ఉంది. ఇక చూస్తే తెలంగాణా కాంగ్రెస్ వ్యవహారాలను నేరుగా ప్రియాంకా గాంధీయే చూస్తున్నారు. ఆమె తెలంగాణా సీనియర్ల తిరుగుబాటుని నిశితంగా పరిశీలిస్తున్నారు అని అంటున్నారు. నివేదిక వచ్చాక ఆమె పూర్తిగా దృష్టి పెడతారు అని తెలుస్తోంది. ఆ మధ్య హైదరాబాద్ వచ్చి తెలంగాణాలో సభ పెట్టిన రాహుల్ గాంధీ కూడా సీనియర్లకు ఇండైరెక్ట్ గానే హెచ్చరికలు జారీ చేసారు. పదవులు తీసుకుని ఇంట్లో కూర్చుంటే కుదరదు అందరూ పనిచేయాలని ఆయన ఆదేశించారు. కాంగ్రెస్ పార్టీ ఈ విషయంలో ఎవరినీ ఉపేక్షించదని కూడా రాహుల్ కరాఖండీగా చెప్పారని అంటున్నారు.ఇపుడు కూడా హై కమాండ్ స్టాండ్ అదేనా అన్నది చూడాల్సి ఉంది. ఇంకో వైపు చూస్తే హై కమాండ్ పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డిని పదవి నుంచి తప్పించే విషయం ఏదీ ఆలోచన చేయదని అంటున్నారు. ఎన్నికలు ముంగిట్లో పెట్టుకుని ఎవరిని పీసీసీ చీఫ్ గా తెచ్చినా కాంగ్రెస్ లో లుకలుకలు అలాగే ఉంటాయని కూడా ఆలోచిస్తోందిట. అందుకే సీనియర్ల అభిప్రాయలను తెలుకుని తాజాగా ప్రకటించిన కమిటీలలో మార్పులు చేర్పులు కొన్ని చేసు సర్దుబాటు చేయడానికే చూస్తారని అంటున్నారు.ఇవన్నీ పక్కన పెడితే రేవంత్ రెడ్డి వచ్చే ఏడాది మొదట్లో సుదీర్ఘ పాదయాత్రకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఆయన తెలంగాణా అంతటా అయిదారు నెలల పాటు పర్యటించే విధంగా తన అజెండాని రెడీ చేసి పెట్టుకున్నారు. దానికి హై కమాండ్ ఆమోదముద్ర ఉంది అంటున్నారు. అంటే కాంగ్రెస్ హై కమాండ్ రేవంత్ రెడ్డికి ఫ్రీ హ్యాండ్ ఇచ్చిందని చెబుతున్నారు. యువకుడు చరిష్మా ఉన్న లీడర్ గా రేవంత్ రెడ్డి వైపే కాంగ్రెస్ పెద్దలు ఉంటూ తెలంగాణా కాంగ్రెస్ విషయంలో సీనియర్లకే నచ్చచెబుతారని అంటున్నారు. మరి అప్పటికీ సీనియర్లు మాట వినకపోయినా నిరసనలు కొనసాగినా ఏమవుతుంది అన్నది మాత్రం తెలియడంలేదు.

# దేశీయంగా అభివృద్ధి చేసిన రక్షణ పరికరాల మార్కెటింగ్

న్యూఢిల్లీ, డిసెంబర్ 18:దేశీయంగా అభివృద్ధి చేసిన రక్షణ పరికరాలను అంతర్జాతీయ వ్యాపారుక్రీడాకారులకు మార్కెటింగ్ చేయడానికి ప్రభుత్వం ఈ క్రింది చర్యలు తీసుకుంది:

కేటగిరీ 6 (ఆయుధాల జాబితా)లో పేర్కొన్న వస్తువుల ఎగుమతి రక్షణ మంత్రిత్వ శాఖ జారీ చేసిన ప్రస్తుత స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపి) ద్వారా నిర్వహించబడుతుంది. రక్షణ ఎగుమతులను ప్రోత్సహించడానికి, వ్యాపారాన్ని సులభతరం చేయడానికి ఎస్ఓపిని నియతానుసారంగా క్రమబద్ధీకరించడం ,సరళీకృతం చేయడం జరిగింది.

ఎక్స్ పోర్ట్ ఆథరైజేషన్ మంజూరు కోసం దరఖాస్తులను స్వీకరించడం ,ప్రాసెసింగ్ చేయడం కోసం ఎండ్ టు ఎండ్ పోర్టల్ ? లిలిలి.టవటవనిఇవవలీతిఎ.ఐనీల.తిని ను అభివృద్ధి చేశారు. ఎక్స్ పోర్ట్ అనుమతులను పోర్టల్ ద్వారా డిజిటల్ సంతకం తో జారీ చేస్తారు.

రక్షణ మంత్రిత్వ శాఖ మూడు ఓజిఇఎల్ లను (ఓపెన్ జనరల్ ఎక్స్ పోర్ట్ లైసెన్స్) తీసుకువచ్చింది; ఎంపిక చేసిన భాగాలు, విడి భాగాల కోసంఒకటి; మరొకటి సాంకేతిక పరిజ్ఞాన ఇంట్రా-కంపెనీ బదిలీ ; మూడవది ప్రధాన ప్లాట్ ఫారాల కోసం.

వివిధ దేశాల నుండి అందుకున్న విచారణలతో సహా ఎగుమతి సంబంధిత చర్యలపై సమన్వయం , ఫాలో-అప్, ఎగుమతి ప్రమోషన్ కోసం ప్రైవేట్ ,ప్రభుత్వ రంగ సంస్థలను సులభతరం చేయడానికి రక్షణ మంత్రిత్వ శాఖలో ఎగుమతి ప్రోత్సాహక సెల్ ఏర్పాటు చేశారు.

ప్రభుత్వ ,ప్రైవేట్ రంగాల దేశీయ రక్షణ ఉత్పత్తుల ఎగుమతి ప్రోత్సాహానికి డిఫెన్స్ అటాచ్ లు తప్పనిసరి చేశారు. దేశీయంగా తయారైన పరికరాల ఎగుమతిని ప్రోత్సహించడానికి, దేశీయ రక్షణ పరికరాల ఎగుమతిని ప్రోత్సహించడానికి డిఫెన్స్ అటాచీలకు వారి వార్షిక అవసరానికి అనుగుణంగా ఆర్థిక సహాయం అందించే ఒక పథకం అమలులో ఉంది

వ్యూహాత్మక పరిగణనలకు లోబడి, దేశీయంగా తయారైన రక్షణ ఉత్పత్తులను లైన్స్ ఆఫ్ క్రెడిట్ / ఫండింగ్ ద్వారా ప్రోత్సహిస్తున్నారు.

వివిధ వాటాదారుల నుండి అందుకున్న ఎగుమతి లీడ్ లు ఆన్ లైన్ పోర్టల్ ద్వారా రిజిస్టర్డ్ భారతీయ రక్షణ ఎగుమతిదారులకు వ్యాప్తి చేయబడతాయి. ఇతర దేశాలలో ఉత్పన్నమయ్యే ఎగుమతి అవకాశాలకు భారతీయ రక్షణ ఎగుమతిదారులు త్వరగా స్పందించడానికి ఈ సౌకర్యం సహాయపడుతుంది.

ప్రభుత్వ, ప్రైవేటు రంగాల నుంచి స్వదేశీ రక్షణ ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు 'ఇండియన్ డిఫెన్స్ ఇండస్ట్రీ, ఎ గ్లోబల్ రీచ్', 'కేటలాగ్ ఇండియన్ డిఫెన్స్ ఇండస్ట్రీ 2022' అనే రెండు ఎగుమతి బుక్ లెట్ లను 2022 మార్చి నెలలో విడుదల చేశారు.

రక్షణ ఎగుమతులను పెంచడానికి, పారిశ్రామిక సంఘాల ద్వారా డిడిపి, రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో స్నేహపూర్వక దేశాలు (ఎఫ్ఎఫ్సి ) తో వెబినార్లు నిర్వహిస్తారు. ఇప్పటివరకు ఎటువంటి మొత్తం 33 వెబినార్లు నిర్వహించారు.రక్షణ ఎగుమతిదారులను కలవడానికి భారతదేశాన్ని సందర్శించే విదేశీ ప్రతినిధుల (ప్రభుత్వం ,సేవల నుండి) సౌలభ్యం కోసం భారత రక్షణ పరిశ్రమ సామర్థ్యాలను అర్థం చేసుకోవడానికి, వారికి ఆసక్తి ఉన్న సంభావ్య రంగాలను అన్వేషించడానికి ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేశారు,

రక్షణ ఆవిష్కరణలపై సహకారాన్ని పెంచడానికి ,ఆవిష్కరణ, సైన్స్ ,సాంకేతిక పర్యావరణ వ్యవస్థల రంగాలలో లోతైన సహకారాన్ని ప్రారంభించడానికి చర్యలు తీసుకోవడానికి యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా (యుఎస్ఎ), యునైటెడ్ కింగ్డం (యుకె), ఆస్ట్రేలియా ,స్వీడన్లతో ఇన్నోవేషన్స్ ఫర్ డిఫెన్స్ ఎక్స్ లెన్స్ - డిఫెన్స్ ఇన్నోవేషన్ ఆర్గనైజేషన్ (ఐడిఎక్స్-డిఐఓ) మెమోరాండం ఆఫ్ ఇంటెంట్ (ఎంఓఐ) ను పంచుకుంది.

రక్షణ శాఖ సహాయ మంత్రి శ్రీ అజయ్ భట్ ఈ రోజు లోక్ సభలో శ్రీ విష్ణు దయాళ్ రామ్ కు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానం లో ఈ వివరాలుతెలిపారు. .

# ఇంజినీరింగ్ తర్వాత ఇంటర్ చేసిన రోహిత్ రెడ్డి-బిజెపి ఎమ్మెల్యేల రఘునందర్ రావు

హైదరాబాద్ డిసెంబర్ 18 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );టీఆర్ఎస్ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి ఇటీవల టీఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలుకు ప్రయత్నించిన ముగ్గురు ఏజెంట్లను పట్టించి ఒక్కసారిగా గులాబీ పార్టీలో హీరో అయిపోయాడు. అయితే అతడిపై నజర్ వేసిన బీజేపీ ఇప్పుడు ఈడీ దాడులు చేస్తోంది. తాజాగా ఆయన అఫిడవిట్ లోని తప్పులు లెంకే పనిలో పడింది.2018 ఎన్నికల అఫిడవిట్ లో ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి ఇంటర్ చదివినట్లు ఉందని.. కానీ 2009 ఎన్నికల అఫిడవిట్ లో స్వీడన్ లో బీటెక్ పూర్తి చేసినట్లు పేర్కొన్నాడని లూప్ హోల్ వెతికారు. ఈ విషయంపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తున్నట్టు తెలిపారు. 2009లో ఇంజినీరింగ్ చేసిన వ్యక్తి.. 2018లో ఇంటర్ చేస్తాడా? అని ప్రశ్నించారు. అధికారులు రోహిత్ రెడ్డి బయోడేటా అడగడానికి కారణం ఇదేమోనని రఘునందర్ తెలిపారు.ఎన్నికల అఫిడవిట్ లో తప్పుడు సమాచారం ఇస్తే అధికారులు కేసులు నమోదు చేస్తారని స్పష్టం చేశారు. భారత ఎన్నికల సంఘానికి రోహిత్ రెడ్డి విద్యార్హతపై ఫిర్యాదు చేస్తున్నట్టు రఘునందన్ రావు తెలిపారు. ఈడీ దాడుల విషయంలో భాగ్యలక్ష్మి అమ్మవారిపై ప్రమాణం చేయాలంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కు రోహిత్ రెడ్డి సవాల్ విసిరిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే రఘునందన్ దీనికి కౌంటర్ ఇచ్చారు. బీఆర్ఎస్ కు ప్రమాణాల మీద ఎప్పుడు నమ్మకం వచ్చిందని ప్రశ్నించారు. ఈడీ గురించి బండి సంజయ్ ప్రెస్ మీట్ చూసి మాట్లాడాలని హితవు పలికారు. హరీశ్ రావు ఎమ్మెల్యే కాకముందు అడ్డదారిలో మంత్రి అయ్యారని విమర్శించారు. ఆయనకు తమ పార్టీ అధ్యక్షుడి గురించి మాట్లాడే అర్హత లేదని రఘునందన్ రావు మండిపడ్డారు.బీకామ్ లో ఫిజిక్స్ ఉంటుందని అప్పట్లో ఏపీ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు నిజంగానే నవ్వులు పూశాయి. రాజకీయాల్లో ఉన్న మన నేతల తెలివితేటలను బయటపెట్టాయి. అయితే



చదువు వచ్చినా రాకున్నా ఏదోలా మేనేజ్ చేసి గడిపేద్దామని వస్తుంటారు. చదువు సంధ్యలో విషయంలో అవమానాలు కాకుండా ఫేక్ డిగ్రీలు తెచ్చుకుంటారు. అయితే అవి ఎప్పుడో ఒకప్పుడు బయటపడుతూనే ఉంటాయి

# టీయూడబ్ల్యూజే సేవలు ప్రశంసనీయం - మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి




ఖమ్మం, డిసెంబర్ 18: (నేటినిజం ప్రతినిధి): ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు సోదరుల సంక్షేమమే ధ్యేయంగా కృషి చేస్తున్న 'తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (టీయూడబ్ల్యూజే) సేవలు ప్రశంసనీయమని బీఆర్ఎస్ రాష్ట్రనాయకులు, ఖమ్మం మాజీ పార్లమెంటు సభ్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఖమ్మం నగరంలోని ఎస్ఆర్ గార్డెన్స్లో ఆదివారం జరిగిన టీయూడబ్ల్యూజే ఉమ్మడి ఖమ్మం జిల్లా మూడవ మహాసభలకు పొంగులేటి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ అహర్నిశలు సమాజ శ్రేయస్సుకు పాటుపడే విలేకరుల పక్షాన నిలిచి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న తీరు అభినందనీయమన్నారు. కరోనా లాంటి కష్టకాలంలో బాధిత జర్నలిస్టుల కుటుంబాలకు అండగా నిలిచి టీయూడబ్ల్యూజే అందరి మన్ననలను పొందిందన్నారు. అనంతరం నిర్వాహకులు పొంగులేటికి జ్ఞాపికను అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు.

# ఆరోపణలు రుజువు చేస్తే తన పదవికి రాజీనామా: రోహిత్ రెడ్డి

హైదరాబాద్ డిసెంబర్ 18 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: బీజేపీ నాయకులు చేస్తున్న ఆరోపణలు వాస్తవమని రుజువు చేస్తే తన పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నానని తాండూరు ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి అన్నారు. తమ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి, ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. శనివారం హైదరాబాద్లోని చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్న రోహిత్ రెడ్డి.. దమ్ముంటే భాగ్యలక్ష్మి ఆదివారం ఉదయం 10 గంటలకు ఆలయానికి రావాలని.. కర్ణాటక కేసుపై ప్రమాణం చేద్దామని బండి సంజయ్కి సవాల్ విసిరిన విషయం తెలిసిందే. చెప్పినట్లుగానే రోహిత్ రెడ్డి నేడు భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయానికి వచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తన సవాల్ను ఎందుకు స్వీకరించలేదని బండి సంజయ్ని ప్రశ్నించారు. కర్ణాటక పోలీసులు తనను ఎప్పుడూ విచారణకు పిలువలేదని, ఏ ఎఫ్ఐఆర్లోనూ తన పేరు లేదని స్పష్టం చేశారు. తనపై చేసిన ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవాలు లేవన్నారు.బీజేపీ నేతలు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని విమర్శించారు. వారికి అనుకూలంగా లేనివారిని బీజేపీ టార్గెట్ చేస్తున్నదని ఆరోపించారు. అధికార పార్టీ నేతలను కేంద్ర దర్యాప్తు సంస్థలతో టార్గెట్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. బండి సంజయ్ తనపై చేసిన ఆరోపణలు తప్పని ప్రజలకు అర్థమయిందన్నారు. మతం పేరుతో యువతను రెచ్చగొడుతున్నాడని చెప్పారు.బండి సంజయ్కు వకాల్తా పుచ్చుకొని మాట్లాడుతున్న రఘునందన్ రావు వందల కోట్ల ఆస్తులు ఎలా సంపాదించారని ప్రశ్నించారు. పరిశ్రమల యజమానులను బెదిరించలేదా అని నిలదీశారు. గతంలో ఓ మహిళ రఘునందన్పై పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు. ఎంఐఎం నేతలతో టచ్లో ఉన్నదని వాస్తవం కాదా అన్నారు.

# భార్యను 50 ముక్కలుగా నరికి చంపిన భర్త

రాంచీ , డిసెంబర్ 18:శ్రద్ధా వాకర్ హత్య ఘటన మరువక ముందే, ఆ మాదిరి ఘటన మరొకటి చోటు చేసుకుంది. ఓ వ్యక్తి తన భార్యను 50 ముక్కలుగా నరికి చంపేశాడు. ఈ దారుణ ఘటన జార్ఖండ్లోని సాహెబ్గంజ్ జిల్లాలోని బోరియో పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.

వివరాల్లోకి వెళ్తే.. దిల్దార్ అన్సారీ అనే యువకుడు ఓ యువతితో గత రెండేండ్ల నుంచి సహజీవనం చేస్తున్నాడు. అయితే ఇటీవలే ఆ యువతిని పెళ్లి చేసుకున్నాడు. అతడికి ఆమె రెండో భార్య. సహజీవనంతో సరిపెట్టుకుందామని అన్సారీ అనుకున్నాడు. కానీ అది పెళ్లి దాకా దారి తీయడంతో ఆమెను ఎలాగైనా చంపాలనుకున్నాడు. దీంతో శనివారం ఆమెను చంపి, శరీర భాగాలను 50 ముక్కలుగా నరికాడు. అనంతరం ఆ భాగాలను పలు ప్రదేశాల్లో పడేశాడు.

ఈ హత్య కేసులో తాను దొరకద్దనే ఉద్దేశంతో తన భార్య అదృశ్యమైందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇదే సమయంలో నిర్మాణంలో ఉన్న ఓ అంగన్వాడీ వద్ద మహిళా మృతదేహం ఛిద్రమై ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది.

దీంతో సాహెబ్గంజ్ ఎస్పీ రంగంలోకి దిగారు. ముక్కలు ముక్కలుగా నరికిన మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ ప్రాంతంలో 12 భాగాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. డాగ్ స్క్వాడ్తో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. అనుమానంతో భర్త అన్సారీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. లోతుగా విచారించగా చేసిన నేరాన్ని అంగీకరించాడు. మృతురాలిని రుబీకా పహదీన్గా పోలీసులు గుర్తించారు.

పహదీన్ మిగతా శరీర భాగాల కోసం పోలీసులు గాలిస్తున్నారు. అయితే పెళ్లి చేసుకుంటానని నమ్మించి, ఆమెను ప్రలోభాలకు గురి చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ హత్యతో ఇంకెవరికైనా ప్రమేయం ఉందా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# తిరుమల శ్రీవారికి రూ.1.20కోట్ల విలువైన కంఠాభరణం.. సమర్పించిన వైవీ సుబ్బారెడ్డి దంపతులు

తిరుపతి డిసెంబర్ 18:తిరుమల శ్రీవారికి విశిష్టమైన కంఠాభరణాన్ని సమర్పించారు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి దంపతులు. తిరుమల వెంకటేశ్వరస్వామికి విలువైన కానుక సమర్పించారు. శ్రీవారికి విశిష్టమైన కంఠాభరణాన్ని సమర్పించారు.

ఈ ఆభరణం విలువ రూ.1.20 కోట్లు. ఈ కంఠాభరణాన్ని వైవీ సుబ్బారెడ్డి దంపతులు టీటీడీ అధికారులకు అందజేశారు. తెలుగు రాష్ట్రాల్లోని దేవాలయాల అభివృద్ధికి టీటీడీ సహకారం అందిస్తోంది. తాజాగా తెలంగాణలోని కోరుట్ల నియోజకవర్గంలో 89 దేవాలయాలకు నిధులు కేటాయించింది. ఒక్కో ఆలయానికి రూ.10 లక్షల చొప్పున రూ.9.20 కోట్లు మంజూరు చేసింది.



# నినాదాలతో హోరెత్తించిన సచిన్ పైలట్ మద్దతుదారులు

జైపూర్, డిసెంబర్ 18: రాజస్థాన్‌లో రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర కొనసాగుతోంది. రాహుల్ యాత్ర వేదికగా సీఎం అశోక్ గహ్లోట్, మాజీ డిప్యూటీ సీఎం సచిన్ పైలట్ వర్గాల మధ్య విభేదాలు బయటపడుతున్నాయి. భారత్ జోడో యాత్రలో ఆదివారం సచిన్ పైలట్ మద్దతుదారులు ఆయనకు మద్దతుగా నినాదాలతో హోరెత్తించారు.

సచిన్ పైలట్ జిందాబాద్, మన సీఎం ఎలా అంటే సచిన్ పైలట్‌లా ఉండాలని వారు నినదించారు. ఒక రోజు విరామం అనంతరం జోడో యాత్ర దౌసాలో 14వ రోజు పున:ప్రారంభమైంది. సచిన్ పైలట్‌కు అనుకూలంగా ఆయన వర్గీయులు నినాదాలు చేసిన సమయంలో రాహుల్ వెంట పైలట్, అశోక్ గహ్లోట్‌లున్నారు.

ఇక సెప్టెంబర్ 7న కన్యాకుమారిలో ప్రారంభమైన భారత్ జోడో యాత్ర ఇప్పటివరకూ తమిళనాడు, కేరళ, కర్నాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌ల మీదుగా రాజస్థాన్‌లో ప్రస్తుతం కొనసాగుతోంది. శుక్రవారం నాటికి రాహుల్ యాత్ర వంద రోజులు పూర్తి చేసుకుంది. డిసెంబర్ 24న భారత్ జోడో యాత్ర ఢిల్లీ చేరుకోనుండగా ఎనిమిది రోజుల అనంతరం పున:ప్రారంభమవుతంది. రాహుల్ యాత్ర ఢిల్లీ, యూపీ, హర్యానా, పంజాబ్ మీదుగా చివరిగా జమ్ము కశ్మీర్‌లో ముగుస్తుంది.

# బెంగళూరు శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశికి విస్తృత ఏర్పాట్లు



బెంగుళూరు, డిసెంబర్ 18: బెంగుళూరు శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా స్వామివారి దర్శనం కల్పించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు బెంగుళూరు స్థానిక సలహా మండలి అధ్యక్షులు రవి సంపత్ నారాయణ చెప్పారు. బెంగుళూరులోని టీటీడీ సమాచార కేంద్రంలో డిప్యూటీ ఈవో గుణ భూషణ్ రెడ్డితో కలిసి ఆయన వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లను మీడియాకు వివరించారు.

వైకుంఠ ఏకాదశి రోజు తిరుమలకు వెళ్లి శ్రీవారిని దర్శించుకోలేని భక్తులు బెంగుళూరులోని స్వామి వారిని దర్శించుకోవాలని భక్తులకు సూచించారు. వైకుంఠ ఏకాదశి రోజున తెల్లవారుజాము 2 గంటల నుంచి స్వామివారి దర్శనం ప్రారంభమవుతుందని తెలిపారు. ఆలయం వద్ద వీఐపీలకు ప్రత్యేక క్యూ లైన్, రూ. 200 శీఘ్ర దర్శనం ప్రత్యేక క్యూ లైన్, సర్వదర్శనం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వీఐపీలు తమకు ప్రత్యేకంగా కేటాయించిన సమయంలోనే వచ్చి స్వామివారిని దర్శించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మిగతా సమయం అంతా సర్వదర్శనానికి కేటాయిస్తున్నట్లు తెలిపారు. క్యూలైన్లలో వేచి ఉండే భక్తులకు ఇబ్బంది లేకుండా చలువ పందిళ్ళు సూచిక బోర్డులను ఏర్పాటు చేస్తామన్నారు. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక, భక్తి సంగీత కార్యక్రమాలు ఉంటాయని, తిరుమల నుండి వచ్చే శ్రీవారి లడ్డు ప్రసాదము,క్యాలెండర్లు, డైరీలు భక్తులకు అందుబాటులో ఉంచనున్నట్లు వివరించారు.

# అట్లాంటాలోని అపార్ట్‌మెంట్‌లో కాల్పులు.. ఇద్దరు టీనేజర్స్ మృతి.. ఆన్‌లైన్ వివాదమే కారణం

న్యూఢిల్లీ, డిసెంబర్ 18: అమెరికాలో మరోసారి తుపాకీ పేలింది. అట్లాంటాలోని ఒక అపార్ట్‌మెంట్ లోపల కాల్పులు జరిగాయి. శనివారం సాయంత్రం జరిగిన ఈ సంఘటనలో ఇద్దరు టీనేజర్స్ మరణించారు. పలువురు గాయపడ్డారు. గాయపడ్డ వాళ్లను ఆస్పత్రిలో తరలించి చికిత్స అందిస్తున్నారు. సోషల్‌మీడియాలో మొదలైన వివాదం ఇద్దరు టీనేజర్స్ మరణానికి కారణమైంది. కాల్పుల సంఘటనలో 14, 16 ఏళ్ల వయసున్న ఇద్దరు అబ్బాయిలు చనిపోయారు. ఇద్దరు అబ్బాయిలు, 15 ఏళ్ల బాలిక గాయపడింది అని డిప్యూటీ చీఫ్ చార్లెస్ హంప్టన్ జూనియర్ తెలిపాడు.

'సోషల్ మీడియా వివాదమే కాల్పులకు కారణం. తుపాకులు చేతబూనిన కొందరు యువకులు శనివారం సాయంత్రం 5 గంటలకు అట్లాంటాలోని అపార్ట్‌మెంట్‌కు వచ్చారు. వాళ్లను చూసిన మరో గ్రూప్ కాల్పులు మొదలు పెట్టింది. ఇరువర్గాలు మధ్య జరిగిన ఈ కాల్పుల్లో ఇద్దరు చనిపోయారు. సిటీలోని చాలామంది యువలకు చేతిలో గన్స్ ఉన్నాయి' అని హంప్టన్ వెల్లడించాడు. అయితే.. గన్‌ఫైర్ వెనక మరేదైనా కారణం ఉందేమోననే కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# పార్కులు.. ఆహ్లాదానికి చిరునామాలు

హైదరాబాద్, డిసెంబర్ 18:ప్రజా అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు పెరుగుతున్నా పచ్చదనం పెంపును అదేస్థాయిలో చిత్తశుద్ధితో చేపడుతున్నట్లు విప్ అరెకపూడి గాంధీ తెలిపారు. కాంక్రీట్ కారుణ్యంలో కాలనీ ప్రజలకు ఏమాత్రం ఆహ్లాదం దూరం కాకుండా పార్కులను పూర్తి స్థాయి వసతులతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలో సమతానగర్, నాగార్జున హోమ్స్‌లలో రూ.2.10కోట్ల నిధులతో చేపట్టనున్న పార్కు అభివృద్ధి, సీసీ నిర్మాణ పనులకు కార్పొరేటర్ శ్రీనివాసరావుతో కలిసి విప్ శనివారం శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. పార్కు స్థలాలు అన్యాక్రాంతం కాకుండా కాపాడుతూ వాటిలో పచ్చదనం, వాకింగ్ ట్రాక్, చిన్న పిల్లలక ఆట స్థలాలు వంటి వాటిని సమతానగర్ పార్కులో కల్పిస్తున్నామన్నారు. దైనందిన జీవితం ఉరుకులు పరుగులతో ఉంటున్నందున నివాస కాలనీల్లోనే పూర్తిస్థాయి వసతుల పార్కులు ఆహ్లాదాన్నందించేలా తీర్చిదిద్దటమే లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా కాలనీల్లో పార్కులను తగు సౌకర్యాలతో అందుబాటులోకి తీసుకువచ్చామని, ఈ ప్రక్రియను ముమ్మందూ కొనసాగిస్తామని విప్ తెలిపారు.

పజలకు మెరుగైన రవాణా సౌకర్యం కోసం కాలనీల్లో సౌకర్యవంతమైన రహదారుల నిర్మాణం చేపడుతున్నట్లు, యూజీడీ పనులు పూర్తయిన చోట రహదారుల నిర్మాణాలు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. అభివృద్ధి పనుల్లో ప్రజలను భాగస్వాములను చేస్తూ నియోజకవర్గ సమగ్ర పురోభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు విప్ గాంధీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాలనీవాసులు, బీఆర్ఎస్ పార్టీ నేతలు, మహిళా నేతలు తదితరులు పాల్గొన్నారు.

వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరనగర్‌లో జరిగిన అయ్యప్ప పడి పూజా మహోత్సవంలో విప్ గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. మాజీ కార్పొరేటర్ రంగారావు, బీఆర్ఎస్ పార్టీ నేతలు, స్వాములు పాల్గొన్నారు.కొండాపూర్ సిద్దిక్‌నగర్ నివాసి కిశోర్‌గుప్త హైదరాబాద్ నుంచి శబరిమలకు కాలినడకన వెళ్లి స్వామి దర్శనం అనంతరం తిరిగి నగరానికి చేరుకున్నాడు. ఈ సందర్భంగా విప్ గాంధీ ఆయనను తన నివాసంలో అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నేతలు, బీఆర్ఎస్ నేతలు సత్యనారాయణ, మల్లేశ్, శ్రీనివాస్, పశుపతి, నటరాజ్, సంపత్, భరత్ పాల్గొన్నారు

# దేశంలో రైతు ప్రభుత్వం కోసం బీఆర్ఎస్ ఏర్పాటు : మంత్రి నిరంజన్ రెడ్డి



వనపర్తి, డిసెంబర్ 18: దేశంలో రైతుల ప్రభుత్వం రావాలని ముఖ్యమంత్రి కేసీఆర్ బీఆర్ఎస్‌ను ఏర్పాటు చేశారని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. వనపర్తి వ్యవసాయ మార్కెట్ నూతన పాలకమండలి బాధ్యతలు స్వీకరణకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతును రాజుగా చేయాలన్నదే కేసీఆర్ లక్ష్యమని అన్నారు. తెలంగాణ వ్యవసాయ అనుకూల విధానాలను దేశంలోని ప్రతి రైతు దృష్టికి తీసుకెళ్లి మద్దతు కూడగడతామని పేర్కొన్నారు.

ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ వ్యవసాయ అనుకూల పథకాలు అమలు అవుతున్నాయని అన్నారు. ప్రభుత్వం సాగునీటి రంగానికి అధిక ప్రాధాన్యత కల్పించడంతో తెలంగాణ సస్యశ్యామలంగా మారుతుందని వెల్లడించారు. గడిచిన ఎనిమిదేళ్లలో రాష్ట్రంలో అదనంగా కోటి ఎకరాలు సాగులోకి వచ్చిందన్నారు. రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత కరంటు, సాగునీటి కల్పనతో రైతులలో ఆత్మవిశ్వాసం పెరిగిందని వివరించారు.

వ్యవసాయం దండుగ కాదు. పండుగ అని కేసీఆర్ నిరూపించారని అన్నారు. వ్యవసాయ రంగం బలోపేతం అయితే అత్యధిక శాతం మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నది కేసీఆర్ ఆలోచనని పేర్కొన్నారు. కేంద్రంలోని ప్రభుత్వానికి వ్యవసాయరంగా పట్ల నిర్దిష్టమయిన విధానం లేదని దుయ్యబట్టారు.ఎరువుల సబ్సిడీలో కోత, పంటల కొనుగోలులో నిర్లక్ష్యం, డీజిల్ , పెట్రోల్ ధరల పెంపుతో వ్యవసాయంలో పెట్టుబడి ఖర్చులు అనూహ్యంగా పెరిగిపోయాయని ఆరోపించారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన రమేష్ గౌడ్, వైస్ చైర్మన్ బాలీశ్వర్ రెడ్డి, డైరెక్టర్లను మంత్రి అభినందించారు.

# రథం వారాహిని ఆపి చూడండి.. నేనేంటో చూపిస్తా: పవన్ కల్యాణ్

అమరావతి డిసెంబర్ 18 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఎన్నికల రథం వారాహిని ఆపి చూడండి.. నేనేంటో చూపిస్తా చూపిస్తానంటూ అధికార పార్టీకి జనసేన అధినేత పవన్ కల్యాణ్ సవాల్ విసిరారు. సత్తెనపల్లిలో కౌలు రైతు భరోసా యాత్రలో పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రాదన్నారు. ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు వ్యతిరేక శక్తులను ఏకం చేస్తానని స్పష్టం చేశారు. ప్రభుత్వ దుశ్చర్యల వల్లే రోడ్ల మీదకు వచ్చిపోరాడుతున్నానన్నారు. ఎవరికో కొమ్ముకాస్తున్నామని వైఎస్సార్ కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు.బీజేపీ, తెలుగుదేశం పార్టీలకు అమ్ముడుపోయే ఖర్మ నాకు లేదని, పింఛన్లు, బీమా సొమ్ము నుంచి కమిషన్లు కొట్టేసే రకం కాదన్నారు. ప్రభుత్వ వ్యవస్థలను ఇంకముందూ అధికార పార్టీ వైఎస్సార్‌సీపీ వాడుకుంటోందని విమర్శించారు. ఎలాంటి దాడులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. లాఠీ దెబ్బలు తినేందుకైనా.. జైలుకు వెళ్లేందుకైనా తాను సిద్ధమని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో చాలా గొడవలు వస్తాయన్నారు. అధికారం పోతుందని వైఎస్సార్ కాంగ్రెస్ దాడులు చేసే అవకాశాలుంటాయన్నారు. మాచర్లలో పార్టీ కార్యాలయం తగులబెట్టడం చూశామని, జనసేన నేతలు ఎన్నికల వ్యూహం వదిలేస్తే తాను చూసుకుంటానన్నారు. జనసేనను అధికారం దిశగా నడిపించే బాధ్యత మాది అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.మీరందరు కోరుకుంటే నేను సీఎం అవుతా.. లేకపోతే కానన్నారు. వైఎస్సార్ సీపీ వ్యతిరేక ఓటును చీలనివ్వననే మాటకు కట్టుబడి ఉన్నానని, నేను మీ కోసం పని చేయకపోతే నా చొక్కా పట్టుకోండి అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. కౌలు రైతు భరోసా యాత్రలో భాగంగా సత్తెనపల్లికి వచ్చిన పవన్ కల్యాణ్ గుంటూరు శివారు నల్లపాడు వద్ద అభిమానులు ఆయనను గజమాలతో ఘనంగా సత్కరించారు. అయితే, పోలీసులు ఇందుకు అభ్యంతరం తెలిపారు. గజమాల వేస్తామని తమకు ముందుగా సమాచారం ఇవ్వలేదని పోలీసులు పేర్కొనగా.. మాల కూడా వేయనివ్వరా? అంటూ జనసేన నేతలు నిరసన తెలిపారు.

# పేదలకు మెరుగైన సేవలే లక్ష్యంగా వైద్యులు పని చేయాలి : మంత్రి గంగుల




కరీంనగర్, డిసెంబర్ 18(నేటినిజం ప్రతినిధి): పేదలకు మెరుగైన సేవలే లక్ష్యంగా వైద్యులు పని చేయాలని బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ పిలుపునిచ్చారు. కరీంనగర్ జిల్లాకేంద్రంలోని నెహ్రూ చౌరస్తా సమీపంలో జనరల్ ఫిజీషియన్ మౌనికారెడ్డి, రేడియాలజిస్ట్ నరేందర్‌రెడ్డి నేతృత్వంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎంఎన్ఆర్ ఆసుపత్రిని మంత్రి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే కరీంనగర్ వైద్యరంగంలో ఎంతో ముందుకు వెళ్లిందని, స్మార్ట్ వైద్యానికి కేంద్ర బిందువుగా మార్చేందుకు కృషి చేయాలన్నారు. గతంలో గుండె, కిడ్నీ, ఇతరత్రా జబ్బులు వస్తే హైదరాబాద్‌కు వెళ్లి వైద్యం చేయించుకునే పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం కరీంనగర్‌లో అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ వైద్యం అందుబాటులో ఉందన్నారు.

కరీంనగర్‌తో పాటు చుట్టూ ఉన్న నాలుగు జిల్లాల ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్లు అభినందనీయులన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల సైతం వచ్చే ఏడాది నుంచి అందుబాటులోకి వస్తుందని, ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల డాక్టర్లు పేదవారికి మెరుగైన వైద్యం అందించడవే లక్ష్యంగా పనిచేయాలన్నారు. వైద్యులు సేవాభావంతో పనిచేస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని, రాబోయే రోజుల్లో వైద్యం అంటే కరీంనగర్ గుర్తుకు వచ్చేలా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మేయర్ వై సునీల్‌రావు, కార్పొరేటర్లు సరిళ్ల ప్రసాద్, మేచినేని వనజ, మెండి, శ్రీలత, ఆసుపత్రి నిర్వాహకులు అభిలాష్‌రెడ్డి, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రైతులకు రాష్ట్ర ముఖ్యమంత్రి శుభవార్త

**- ఈ నెల 28 నుండి రైతు బందు విడుదలకు కేసీఅర్ ఆదేశం**

**- రైతుల ఖాతాల్లో జమ కానున్న రూ.7800 కోట్లు**

**- సంక్రాంతి కల్లా రైతులందరి ఖాతాల్లో జమ కానున్న రైతుబందు**

**- హర్షం వ్యక్తం చేసిన మంత్రి పువ్వాడ అజయ్ కుమార్**



ఖమ్మం, డిసెంబర్ 18: (నేటినిజం ప్రతినిధి): యాసంగి పంట కాలానికి అందించే పంట పెట్టుబడి రైతుబంధు నిధులను డిసెంబర్28 వ తేదీ నుండి విడుదల చేయాలని ప్రకటించడం శుభపరిణామమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పేర్కొన్నారు. ఈ నెల 28 నుంచి రైతు బంధు నిధులు రైతుల ఖాతాల్లోకి విడుదల చేయడం ప్రారంభించాలని, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు ను సీఎం కేసిఆర్ కి ఆదేశాలు ఇవ్వడం పట్ల మంత్రి పువ్వాడ హర్షం వ్యక్తం చేశారు. రైతు బంధు నిధులు, ఎప్పటిలాగే ఒక ఎకరం నుంచి ప్రారంభమై సంక్రాంతి కల్లా రైతులందరి ఖాతాల్లో జమ కానున్నాయని, ఇందుకోసం గాను 7600 కోట్ల రూపాయలను, రైతుల ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం జమ చేయనున్నదన్నారు. రైతు బంధు పథకం ద్వారా రైతులకు వానాకాలం, యాసంగి రెండు కాలాలకు ఎకరానికి పదివేల రూపాయల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం, పంట పెట్టుబడిని అందించడం, దేశ వ్యవసాయ రంగంలో విప్లవాత్మక కార్యాచరణగా సత్ఫలితాలనిస్తున్నదన్నారు. ఉచిత సాగునీరు, ఉచిత విద్యుత్తుతో పాటు, రైతు బీమా తో పాటు, పంటలు పండించేందుకు నేరుగా రైతు ఖాతాలో పెట్టుబడిని అందించడం ద్వారా తెలంగాణ వ్యవసాయంలో విప్లవాత్మక పరిణామం చోటు చేసుకుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ అనుకూల కార్యాచరణ దేశానికి ఆదర్శంగా నిలవడమే కాకుండా.. దేశ వ్యవసాయ రంగ నమూనా మార్పుకు దారి తీసిందని వివరించారు. ముఖ్యమంత్రి కేసిఆర్ వ్యవసాయ అనుకూల దార్శనిక నిర్ణయాలు, ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణాను దేశంలోనే అగ్రగామిగా నిలిపాయని అన్నారు. దేశ రైతాంగ సంక్షేమానికి, వ్యవసాయ ప్రగతికి బాటలు వేసే దిశగా పక్క రాష్ట్ర ప్రభుత్వాలను, కేంద్రాన్ని ప్రభావితం చేస్తున్నాయని అన్నారు. పలు మార్గాల నుండి రాష్ట్రానికి హక్కుగా రావాల్సిన 40 వేల కోట్ల రూపాయలను రాకుండా కేంద్రం తొక్కిపెట్టిందని, రాష్ట్రానికి రావాల్సిన నిధులను ఇవ్వకుండా, ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తూ తెలంగాణ రైతులను ప్రజలను కష్టాల పాలు చేయాలని కేంద్రం చూస్తున్నదని అన్నారు.కేంద్రం ఎన్ని ఇబ్బందులకు గురి చేసినా, తెలంగాణ రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి విషయంలో ఎన్ని కష్టాలెదురైనా రాజీ పడకుండా రైతులకు రైతు బంధు నిధులను టంచనుగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తుందని గుర్తు చేసారు.

ఎలాంటి కోతలు లేకుండా, రైతు లందరికీ పూర్తి స్థాయిలో, సకాలంలో రైతు బంధు నిధులు విడుదల చేయాలని ఫైనాన్స్ సెక్రెటరీ కి సీఎం కేసిఆర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. ఈ నిర్ణయం, రైతాంగం పట్ల, వ్యవసా యం పట్ల సీఎం కేసిఆర్ పాలనకున్న చిత్తశుద్ధి కి నిదర్శనంగా నిలిచిందన్నారు.

## 40 ఏండ్ల సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం

హైదరాబాద్, డిసెంబర్ 18: దళితుల అభివృద్ధే ముఖ్యమంత్రి కేసీఆర్ ధ్యేయంగా పెట్టుకున్నారని కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో శనివారం మేడిపల్లి దళిత రైతులకు మంత్రి మల్లారెడ్డి పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 40 సంవత్సరాలుగా దళిత రైతులు ఎదుర్కొంటున్న సమస్యను ముఖ్య మంత్రి కేసీఆర్ పరిష్కరించి న్యాయం చేసినట్లు పేర్కొన్నారు. మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా మేడిపల్లిలోని 62 సర్వేనెంబర్‌లో 116 ఎకరాలలో వ్యవసాయం చేసుకుంటున్న రైతులకు హెచ్ఎండీఏ ద్వారా ల్యాండ్ పూలింగ్ చేయించి డెవలప్‌మెంట్ అనంతరం ఎకరాకు 5 వందల గజాల భూమి ఇచ్చే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. 32మంది దళిత రైతులకు ఈసందర్భంగా పట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ హరీశ్, అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి, కీసర ఆర్డీవో రవి, పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

# కన్నుల పండువగా కొమురవెల్లి మల్లన్న కల్యాణోత్సవం



కొమురవెల్లి, డిసెంబర్ 18: కోరిన వారి కోర్కెలు తీర్చే కోర మీసాల కొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో కీలక ఘట్టమైన మల్లన్న కల్యాణ వేడుక ఆదివారం ఉదయం అత్యంత ఘనంగా జరిగింది. మల్లన్న శరణు శరణు అంటూ జయజయధ్వానాలతో ఆలయ ప్రాంగణమంతా మార్మోగిపోయింది. కన్నుల పండువగా జరిగిన మల్లన్న కళ్యాణాన్ని తిలకించడానికి భక్తులు బారులుతీరారు. శివశక్తులు శివాలెత్తి పోయారు. ఒగ్గు పూజారులు ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా మల్లన్న కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. బలిజ మేడలమ్మ, గొల్ల కేతమ్మలను మల్లన్న పెళ్లాడారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆర్థిక మంత్రి హరీశ్ రావు మల్లన్న కల్యాణోత్సవానికై స్వామి వారికి బంగారు కిరీటం, పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను వెండి పల్లెంలో నెత్తిన పెట్టుకుని సంప్రదాయబద్ధంగా మేళ, తాళలతో వచ్చి సమర్పించారు.

బృహన్మఠాదీశుడు సిద్ధగురు మణికంఠ శివాచార్యుల పర్యవేక్షణలో స్వామి వారి కల్యాణం జరిగింది.

మూడు నెలల పాటు జరిగే బ్రహ్మోత్సవాలు మల్లన్న కల్యాణంతో ప్రారంభమయ్యాయి. యేటా మార్గశిర మాసం చివరి ఆదివారం నాడు స్వామి వారి కల్యాణం జరగడం ఆనవాయితీగా వస్తున్నది. వీరశైవ ఆగమ శాస్త్రం ప్రకారం కల్యాణ మహోత్సవం జరిగింది. వధువుల తరఫున మహాదేవుని వంశస్థులు కన్యాదానం చేయగా? వరుడి తరఫున పడిగన్నగారి వంశస్థులు కన్యాదానం స్వీకరించారు.

ఈ వేడుకల్లో రాష్ట్ర మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మల్లారెడ్డి, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ రోజా రాధాకృష్ణ శర్మ, రాష్ట్ర వైద్య సేవలు, మౌళిక సదుపాయ అభివృద్ధి సంస్థ చైర్మన్ ఎర్రోల్ల శ్రీనివాస్, రాష్ట్ర ఎఫ్డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్, ఇతర ముఖ్య ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా నాగోబా

ఆదిలాబాద్, డిసెంబర్ 18: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. శనివారం మంత్రి ఆలయంలో నాగోబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణ పనులను పరిశీలించి అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులకు పలు సూచనలు చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. నాగోబా ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం రూ.10.35 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. మెస్రం వంశీయులు రూ.5 కోట్ల విరాళాలు సేకరించి గుడిని రాతి శిల్పాలతో నిర్మించుకోవడం అభినందనీయమన్నారు. తెలంగాణలో ఆధ్యాత్మిక క్షేత్రాల్లో యాదాద్రి తర్వాత నాగోబా దేవాలయం ఉందన్నారు. జాతరకు తెలుగు రాష్ట్రాలతోపాటు మహారాష్ట్ర, ఒడిశా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు హాజరవుతారని తెలిపారు. దర్బార్, జాతరకు వచ్చే భక్తులు ఇబ్బందులు పడకుండా మిషన్ భగీరథ నీరు, విద్యుత్, రహదారి సౌకర్యం కల్పిస్తామన్నారు. నిత్యపూజ, దీపధూప నైవేద్యాల కోసం పూజారులు, ఆలయ పర్యవేక్షణకు సిబ్బందిని నియమించడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని తెలిపారు. నాగోబా జాతర పూజ రోజు హాజరయ్యే భక్తులకు పౌష్టికాహారం ప్యాకెట్లు పంపిణీ చేస్తామన్నారు.

**దండారీ ఉత్సావాలకు రూ. కోటి**

గిరిజనులు ఉత్సాహంగా జరుపుకునే దండారీ ఉత్సవాలకు గూడేనికి రూ.10 వేల చొప్పున ప్రభుత్వ రూ. కోటి మంజూరు చేస్తున్నదని మంత్రి అన్నారు. గుడిరేవు పద్మపూరి అలయానికి రూ.50 లక్షలు, జంగుబాయి ఉత్సవాలకు రూ.10 లక్షలు ఇచ్చినట్లు తెలిపారు. పోడు భూములు సాగు చేస్తున్న గిరిజన రైతులకు ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి వంటి పథకాలు ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూర్చుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ జడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, మాజీ ఎంపీ నగేశ్, కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వరుణ్‌రెడ్డి, పిఠాధిపతి వెంకట్రావు, ఐటీడీఏ చైర్మన్ కనక లక్కేరావు, మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి, ఇంద్రవెల్లి, నేరడిగొండ జడ్పీటీసీలు పుష్పలత, అనిల్‌జాదవ్, సర్పంచ్ రేణుక పాల్గొన్నారు.

**ఉత్సవాలను వైభవంగా నిర్వహిద్దాం..– ఆదిలాబాద్ కలెక్టర్ సిక్తా పట్నాయక్**

జనవరి మాసంలో ప్రారంభమయ్యే కేస్లాపూర్ నాగోబా జాతర ఉత్సవాలు వైభవంగా నిర్వహిద్దామని ఆదిలాబాద్ కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. జాతర ఏర్పాట్లపై త్వరలోనే జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి భక్తుల సౌకర్యాలపై చర్చిస్తామన్నారు. మెస్రం వంశీయులు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరించి అభివృద్ధి పనులు చేసేందుకు చర్యలు తీసుకుంటమన్నారు.

**కొనసాగుతున్న ఆధ్యాత్మిక ప్రవచనాలు..**

నాగోబా ఆలయ ఆవరణలో మెస్రం వంశీయుల ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక ప్రవచనాలు కొనసాతున్నాయి. శనివారం రాత్రి ఇచ్చోడ మండలంలోని మహదాపూర్‌కు చెందిన నారాయణ మహరాజ్ పాల్గొని భక్తులకు ప్రవచనాలు బోధించారు. నాగోబా విగ్రహ ప్రతిష్ఠాపనతోపాటు ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా డాక్టర్ శ్యామ్, సుమలత తరఫున వెండి కిరీటం బహూకరించారు. ఆయా గ్రామాల నుంచి తరలివచ్చిన మెస్రం వంశీయుల ఆడబిడ్డలకు మెస్రం వంశీయులు నూతన వస్త్రాలను బహూకరించారు. మెస్రం వంశీయుల్లోని 22 కితలకు చెందిన తమ తమ అక్కాచెల్లెళ్లతోపాటు అల్లుళ్లకు నూతన వస్త్రాలు అందించారు. దీంతో నాగోబా ఆలయంతోపాటు గోవాడ్ ప్రాంతాల్లో వేలాది మంది మెస్రం వంశీయుల ఆడబిడ్డలు సందడి చేశారు.

**ఆలయానికి చేరిన కలశాలు**

మెస్రం వంశీయుల ఆధ్వర్యంలో కలశాలను శనివారం సాయంత్రం కేస్లాపూర్ నుంచి నాగోబా ఆలయానికి తరలించారు. హనుమాన్ ఆలయంలో భద్రపర్చిన కలశాలకు ప్రత్యేక పూజలు చేశారు. తమ అల్లుళ్లతో కలశాలను ఆలయం బయటకు తీశారు. భారీ ఊరేగింపుతో నాగోబా ఆలయానికి సంప్రదాయవాయిద్యాల మధ్య తరలించి, ఆలయంలో భద్రపర్చారు. ఆదివారం ఉదయం ఆలయ ప్రారంభోత్సవ వేడుకలు ప్రారంభించనున్నట్లు మెస్రం వంశీయులు తెలిపారు.

# దొంగచాటుగా జింకపై దాడి చేసిన చిరుత

హైదరాబాద్, డిసెంబర్ 18:అడవిలో మేత మేస్తున్న ఓ జింకపై చిరుత దొంగచాటుగా దాడి చేసింది. చిరుత తెలివి చూస్తే వావ్ అనక తప్పరు. ఆ విధంగా జింకపై దాడి చేసింది చిరుత పులి. ఈ వీడియోను ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ ఆఫీసర్ రమేశ్ పాండే తన ట్విట్టర్ ఖాతాలో షేర్ చేశారు. ఈ వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.అడవిలో ఉన్న ఓ చెట్టు సమీపంలో జింక మేత మేస్తోంది. జింక చిరుత కంట పడింది. అయితే నేరుగా చిరుత దాడి చేయకుండా, తెలివిగా దెబ్బకొట్టింది. అక్కడ ఉన్న రహదారి పొడవునా కొంచెం ఎత్తులో మట్టి ఉంది. ఆ మట్టిని అడ్డుగా చేసుకున్న చిరుత నక్కినక్కి ఓ చెట్టు వద్దకు వెళ్లింది. ఇంకేముంది చెట్టును అడ్డు పెట్టుకుని జింకపై దాడి చేసింది. అప్రమత్తమైన జింక పరుగు పెట్టినప్పటికీ చిరుత నుంచి తప్పించుకోలేకపోయింది. వైరల్ అవుతున్న ఈ వీడియోపై నెటిజన్లు చాలా రకాలుగా కామెంట్లు పెడుతున్నారు. చిరుత చాలా తెలివిగా ప్రదర్శించిందని పేర్కొన్నారు.

# వరల్డ్ టెస్ట్ చాంపియన్ షిప్ పాయింట్ల పట్టికలో రెండోస్థానానికి భారత్




హైదరాబాద్, డిసెంబర్ 18:టెస్టు ఫార్మాట్‌కు ఆదరణ కల్పించాలనే ఉద్దేశంతో ఐసీసీ వరల్డ్ టెస్టు చాంపియన్ షిప్‌ను తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ప్రతి రెండేళ్లకు ఒకసారి ప్రపంచ టెస్టు చాంపియన్ షిప్ సైకిల్ ముగియనుండగా.. టాప్–2లో నిలిచిన జట్లు ఫైనల్ మ్యాచ్‌కు అర్హత సాధిస్తాయి. పాయింట్ల పట్టికలో నిలిచే తొలి రెండు జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్‌లో గెలిచిన జట్టు ప్రపంచ టెస్టు చాంపియన్‌గా నిలుస్తుంది. తొలి ఎడిషన్‌లో భారత్‌పై నెగ్గిన న్యూజిలాండ్ చాంపియన్‌గా నిలువగా.. ప్రస్తుతం 2021–2023 చాంపియన్ షిప్ సైకిల్ కొనసాగుతున్నది. వచ్చే ఏడాదిలో టెస్ట్ సైకిల్ ముగియనుండగా.. ఓవల్ స్టేడియంలో వరల్డ్ టెస్ట్ చాంపియన్ షిప్ ఫైనల్ మ్యాచ్ జరుగనున్నది.

### పాయింట్ల పట్టిక రెండోస్థానానికి భారత్..

బంగ్లాతో జరిగిన టెస్టులో భారత్ ఘన విజయం సాధించి వరల్డ్ టెస్ట్ చాంపియన్ షిప్ పాయింట్ల పట్టికలో భారత్ రెండోస్థానానికి ఎగబాకింది. మరోవైపు స్వదేశంలో జరిగిన టెస్టులో ఆస్ట్రేలియా సైతం రెండు రోజుల్లోనే దక్షిణాఫ్రికాను మట్టికరిపించింది. దీంతో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో భారీ మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో ఆస్ట్రేలియా జట్టు ఫైనల్‌కు చేరుకోవడం దాదాపు ఖాయమైంది. సౌతాఫ్రికాపై ఆస్ట్రేలియా విజయం సాధించడంతో భారత్‌కు కలిసివచ్చింది. చిట్టగాంగ్ టెస్టులో భారత్ 188 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడించింది.

అలాగే ఆస్ట్రేలియా ఆరు వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాపై విజయం సాధించింది. ఈ రెండు మ్యాచ్‌లకు ముందు ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో భారత జట్టు నాలుగో స్థానంలో ఉండగా.. దక్షిణాఫ్రికా జట్టు రెండో స్థానంలో ఉండగా.. రెండు మ్యాచ్‌ల తర్వాత ఆస్ట్రేలియా జట్టు 76.92 పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. భారత జట్టు 55.77 పాయింట్లతో రెండో స్థానానికి చేరింది. దక్షిణాఫ్రికా 54.55 పాయింట్లతో మూడో స్థానానికి పడిపోయింది. శ్రీలంక 53.33 పాయింట్లతో నాలుగో స్థానంలో, ఇంగ్లండ్ 44.44 పాయింట్లతో ఐదో స్థానంలో ఉన్నాయి. పాక్ 42.42 పాయింట్లతో ఆరో స్థానంలో ఉంది.

### రెండోస్థానానికి మూడుజట్లు పోటీ..

ఇదిలా ఉండగా.. వరల్డ్ టెస్ట్ చాంపియన్ షిప్‌కు ముందు భారత జట్టు మరో ఐదు టెస్టు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. బంగ్లాదేశ్‌తో మరో టెస్టుతో పాటు.. స్వదేశంలో ఆస్ట్రేలియాతో నాలుగు టెస్టుల సిరీస్ ఆడాల్సి ఉంది. ఈ ఐదు మ్యాచ్‌ల్లో గెలిస్తే టీమిండియా నేరుగా ఫైనల్‌కు ప్రపంచ టెస్ట్ చాంపియన్ షిప్ ఫైనల్‌కు నేరుగా అర్హత సాధిస్తుంది. మరోవైపు ఈ టెస్టుల్లోనైనా టీమిండియా ఓడిపోతే ఆస్ట్రేలియా ? సౌతాఫ్రికా టెస్టు సిరీస్‌పైనే ఆధారపడాల్సి వస్తుంది. ప్రస్తుతం దక్షిణాఫ్రికా మూడు టెస్టు మ్యాచ్‌ల సిరీస్ కోసం ఆస్ట్రేలియా పర్యటనలో ఉంది. అయితే, ఆస్ట్రేలియా జట్టు ఫామ్‌లో ఉన్నందున.. దక్షిణాఫ్రికా కాకు సవాల్‌లాంటిదే. ప్రొటీస్ జట్టును ఆసీస్ క్లీన్‌స్వీప్ చేయగలిగితే, భారత్ ఫైనల్ చేరడం సులువవుతుంది. దక్షిణాఫ్రికా ఒకటి రెండు టెస్టుల్లో గెలిచినా టీమిండియాకు కాస్త ఇబ్బందికరంగా మారుతుంది. ఆస్ట్రేలియా తర్వాత దక్షిణాఫ్రికా తమ సొంత మైదానంలో వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్ ఆడాల్సి ఉంది. ఆస్ట్రేలియా ఫైనల్ చేరడం దాదాపు ఖాగా.. రెండోస్థానం కోసం భారత్, దక్షిణాఫ్రికా, శ్రీలంక జట్లు పోటీపడుతున్నాయి.

# 42మిలియన్ల వ్యూస్‌తో దూసుకుపోతున్న.. జింతాక్ సాంగ్




హైదరాబాద్, డిసెంబర్ 18:ధమాకా చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు మాస్ మహరాజ్ రవితేజ. ఇప్పటి వరకు వచ్చిన అప్డేట్స్ తో 'ధమాకా'పై మంచి హైప్ క్రియేట్ అయ్యింది. ఇక రీసెంట్ విడుదలైన ట్రైలర్ కూడా దూసుకుపోతోంది. ఈ ట్రైలర్ లో రవితేజ మాస్ డైలాగ్ లు, పంచ్ లు, మేనరిజం, యాక్షన్ సన్నివేశాలు ఆకట్టుకుంటున్నాయి. దీంతో సినిమా థియేటర్లలో దుమ్ములేపబోతుందని అర్థం అవుతోంది. రవితేజ ? హీరోయిన్ శ్రీలీలా జంటగా నటిస్తున్న యాక్షన్ ఫిల్మ్ 'ధమాకా' . త్రినాధరావు నక్కిన దర్శకత్వంలో తెరకెక్కబోతోంది. సరిగ్గా ఐదు రోజుల్లో థియేటర్లలో గ్రాండ్ గా రిలీజ్ కాబోతోంది. ఈ సందర్భంగా సినిమా ప్రచార కార్యక్రమాలను జోరుగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా అదిరిపోయే అప్డేట్స్ ను అందిస్తున్నారు. ఇప్పటికే సినిమాలోని అన్ని సాంగ్స్ ను విడుదల చేశారు.

భీమ్స్ సిసిరోలియో అందించిన సంగీతానికి మంచి రెస్పాన్స్ దక్కుతోంది. ముఖ్యంగా మాస్ నెంబర్ గా విడుదలైన 'జింతాక్ సాంగ్ కు మిలియన్ల వ్యూస్ దక్కుతున్నాయి. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించగా.. భీమ్స్ సిసిరోలియో, మంగ్లీ కలిసి పాడారు. ఆగస్టులో విడుదలైన ఈ పాట ప్రస్తుతం ఊపందుకుంది. యూట్యూబ్ లోనూ ట్రెండ్ అవుతోంది. ఇప్పటి వరకు 42 మిలియన్ల వ్యూస్ ను దక్కించుకుంది. రవితేజ ఇటీవల సినిమాల్లో దీనికే ఎక్కువ దక్కడం విశేషం. మిగితా సాంగ్స్ కూడా అద్భుతంగా ఉన్నాయి.ఈ చిత్రాన్ని అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.. భీమ్స్ సిసిరోలియో అద్భుతమైన సంగీతం అందించారు. తనికెళ్ల భరణి, రావు రమేశ్, అలీ, హైపర్ ఆది, పవిత్రా లోకేష్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. డిసెంబర్ 23న గ్రాండ్ గా రిలీజ్ కాబోతోంది.

# అక్రమ డంపింగ్‌ను అరికట్టేందుకు..

హైదరాబాద్, డిసెంబర్ 18:ఆటోనగర్ పారిశ్రామిక వాడ నుంచి వస్తున్న వ్యర్థ రసాయనాల దుర్వాసనకు కారణమైన గోడౌన్లను గుర్తించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంఆర్‌డీసీ చైర్మన్, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. ఆటోనగర్ వ్యర్థ రసాయనాల డంపింగ్‌ను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై శనివారం సనత్‌నగర్‌లోని తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చీఫ్ ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ రఘుతో సమావేశమై సమస్య తీవ్రతను వివరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటోనగర్ పారిశ్రామిక వాడలోని కెమికల్, ఫర్టిలైజర్స్ గోడౌన్స్‌తో పాటు మెకానికల్ షెడ్లలోనూ తనిఖీలు నిర్వహించాలన్నారు. ఆరు నెలలుగా ఆటోనగర్ పారిశ్రామిక వాడ నుంచి వస్తున్న వ్యర్థ రసాయనాల వాసనతో ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని తెలిపారు. ఆరోగ్యాలను కాపాడుకునేందుకు కొందరు తమ సొంత ఇండ్లను ఖాళీ చేసి వెళ్లి పోతున్నారని.. ఇంతటి దుస్థితికి కారణమైన వ్యక్తులను గుర్తించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. భూ వాతావరణ కాలుష్యానికి కారకులైన వారిని చట్టం ముందు నిలబెట్టేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.కేబీఆర్ ఫంక్షన్ హాల్ నుంచి ఆటోనగర్ డంపింగ్ యార్డుకు వెళ్లే మార్గంలో రోడ్లకు ఇరువైపులా కొందరు గుర్తు తెలియని వ్యక్తులు పురాతన భవనాల శిథిలాలతో పాటు చెత్తా చెదారాన్ని వేస్తున్నారని వారిపై నిఘాపెట్టి జరిమానా విధింపజేస్తానని తెలిపారు.

# 7,8 వార్డులో ప్రచారం నిర్వహించిన బి ఆర్ ఎస్ అభ్యర్థి నామాల ఉమా



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 18: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ టౌన్ సెస్ డైరెక్టర్ గా ఎన్నికలలో పోటీ చేస్తున్న వేములవాడ మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ నామాల ఉమా లక్ష్మీరాజం తిప్పాపురంలోని 7, 8 వార్డులలో ఎన్నికల ప్రచారం చేశారు.ఈ సందర్భంగా నామాల ఉమా మాట్లాడుతూ గతంలో మున్సిపల్ చైర్మన్ గా పనిచేశానని, ఎమ్మెల్యే సహకారంతో పట్టణాన్ని అభివృద్ధి చేశామని,మరోసారిఅవకాశం కల్పిస్తే విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సెస్ డైరెక్టర్ గా ఒక్క అవకాశం కల్పిస్తే సెస్ వినియోగదారులకు రుణపడి ఉంటా నని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామతీర్థపు మాధవి రాజు, పట్టణ అధ్యక్షులు పుల్కం రాజు, కౌన్సిలర్ సిరిగిరి చందు, మారం కుమార్,న రాల శేఖర్, కోఆప్షన్ సభ్యులు కట్కూర్ శ్రీనివాస్, సర్వర్ బాబున్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పీర్ మహమ్మద్, బి ఆర్ఎస్ నాయకులు పొలాస నరేందర్, పి చర్ భాస్కర రావు, కందుల క్రాంతి, టైలర్ రాజు, ఇబ్రహీం,దేవరాజుతదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి కరీంనగర్ జిల్లా మహాసభను విజయవంతం చేయండి....

**– టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు లాయక్ పాషా**



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 18: (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా మహాసభను విజయవంతం చేయాలని జర్నలిస్టులను యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు లాయక్ పాషా కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న టీయూడబ్ల్యూజే హెచ్ 143 ఉమ్మడి కరీంనగర్ జిల్లా మహాసభ గోదావరిఖనిలోని టీవీ గార్డెన్స్ లో సోమవారం నిర్వహించనున్నట్లు తెలిపారు. టీయూడబ్ల్యూజే హెచ్ వన్ ఫోర్ త్రీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా మహాసభకు జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాల్సిందిగా మరోసారి విజ్ఞప్తి చేశారు. మీడియా అకాడమీ చైర్మన్,రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ తో పాటు మంత్రివర్యులు కొప్పుల ఈశ్వర్,పెద్దపెల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధు లతోపాటు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ఇస్మాయిల్, ప్రధాన కార్యదర్శి రమణ, ఉమ్మడి జిల్లా కన్వీనర్ బిజిగిరి శ్రీనివాస్ లతోపాటు యూనియన్ రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరవుతున్నట్లు తెలిపారు

# అదరగొడ్తున్న అవతార్ 2.. రెండు రోజుల్లో కలెక్షన్లు ఎంతంటే..?



హైదరాబాద్, డిసెంబర్ 18:।అవతార్ 2 సినిమా ఇండియన్ బాక్సాఫీస్ వద్ద ఉరుములతో కూడిన ప్రారంభానికి తెరతీసింది. ఈ సినిమా తొలి రోజు రూ.41 కోట్లు వసూలు చేసింది. ఇప్పుడు వస్తున్న రిపోర్ట్స్ ప్రకారం, ఈ సినిమా రెండో రోజు కలెక్షన్ దాదాపు రూ.45 కోట్లు దాటింది. ఇక గ్రాస్ కలెక్షన్స్ గురించి చెప్పాలంటే ఈ సినిమా రెండు రోజుల్లోనే ఇండియన్ బ్యాక్సాఫీస్ వద్ద రూ.100 కోట్లు వసూల్ చేసింది. కాగా, ప్రపంచవ్యాప్తంగా కలెక్షన్లు రూ.1700 కోట్లు దాటినట్లు సినిమా మార్కెట్ వర్గాల సమాచారం.

అవతార్ 2 సినిమా అంతటా అదరగొడ్తున్నది. ఎక్కడ చూసినా ప్రేక్షక జనం నీరాజనాలు పడుతున్నారు. మొదటి వారాంతంలో రూ.130 నుంచి రూ.140 కోట్ల వరకు బిజినెస్ చేయగలదని అంచనా వేస్తున్నారు. సినిమాపై ప్రేక్షకుల్లో విపరీతమైన ఉత్కంఠ నెలకొన్నది. దాదాపు రూ.2 వేల కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమాపై ట్రేడ్ పండితుల నుంచి విమర్శకుల వరకు ప్రశంసలు కురుస్తున్నాయి. ఈ సినిమా మన దేశంలో డిసెంబర్ 16 న విడుదలైంది. మన దేశంలో ఇంగ్లిష్, హిందీతో పాటు తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం భాషల్లో కూడా విడుదల చేశారు.

అవతార్ మొదటి రోజు రూ.41 కోట్లు వసూలు చేసినప్పటికీ, అవెంజర్స్ ఎండ్‌గేమ్ సినిమా తొలి రోజు వసూళ్ల కంటే చాలా వెనుకబడి ఉన్నది. అవెంజర్స్ ఎండ్‌గేమ్ చిత్రం విడుదలైన తొలిరోజే దేశవ్యాప్తంగా రూ.52 కోట్లు రాబట్టింది. ఏ హాలీవుడ్ సినిమాకైనా భారతదేశంలోనే ఇదే అత్యధిక తొలిరోజు కలెక్షన్లు సాధించిన రికార్డు. అవతార్ 2 కూడా ఈ రికార్డును బ్రేక్ చేయలేకపోయింది. స్పైడర్‌మ్యాన్ రూ.32.75 కోట్లు, అవెంజర్స్ ఇన్ఫినిటీ వార్ రూ.31.25 కోట్లు, డాక్టర్ స్ట్రేంజ్ రూ.28.75 కోట్ల కలెక్షన్లు వచ్చాయి

# కొత్త రికార్డ్ సృష్టించిన.. కోహ్లీ




భారత్..బంగ్లాదేశ్ మధ్య జరిగిన టెస్ట్ మ్యాచ్ లో టీం ఇండియా మాజీ కెప్టెన్ కోహ్లీ కొత్త రికార్డుని సృష్టించాడు.అంతర్జాతీయ క్రికెట్ లో అత్యధిక క్యాచ్ లు పట్టిన ఆటగాళ్ల జాబితాలో ఎనిమిదో స్థానంలో నిలిచాడు. ఇప్పటివరకు కోహ్లీ పేరుతో 291 క్యాచ్ లు నమోదు అయ్యాయి. 482 మ్యాచుల్లో 572 ఇన్నింగ్స్ లలో ఈ క్యాచ్ లను అందుకున్నాడు. జయవర్దనే 440 క్యాచ్ లతో తొలి స్థానంలో ఉన్నాడు. టీమిండియా గ్రాండ్ విక్టరీ కొట్టింది. బంగ్లాదేశ్ తో జరిగిన మొదటి టెస్ట్ మ్యాచ్ లో టీమిండియా విజయం సాధించింది. ఏకంగా 188 పరుగుల తేడాతో టీమిండియా విజయ ఢంకాను మోగించింది. రెండో ఇన్నింగ్స్ లో 513 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ ను ఆరంభించిన బంగ్లాదేశ్ జట్టు 324 పరుగులకు ఆల్ అవుట్ అయింది. అయితే ఐదో రోజు మొదటి సెషన్ లోనే టీమిండియా విజయం సాధించింది.

# మూడు భారీ మార్పులతో కస్టమర్ల ముందుకు ఐఫోన్ 15

న్యూఢిల్లీ, డిసెంబర్ 18:యాపిల్ నెక్ట్స్ జనరేషన్ డివైజ్ ఐఫోన్ 15 మూడు భారీ మార్పులతో 2023లో కస్టమర్ల ముందుకు రానుంది. కీలక మార్పులను పలువురు స్వాగతిస్తుండగా మరికొందరు సెక్యూరిటీ కారణాలతో పెదవివిరుస్తున్నారు. ఐఫోన్ 15 సిరీస్ యూఎస్‌బీ టైప్–సీ పోర్ట్‌తో రానుంది. లైటనింగ్ పోర్ట్‌ను ఇప్పటివరకూ ఐఫోన్లు ఆఫర్ చేస్తుండగా ఐఫోన్ 15 సిరీస్ యూఎస్‌బీ టైప్–సీ పోర్ట్‌ను ఆఫర్ చేయడం భారీ మార్పుగా చెబుతున్నారు.2024 నాటికి అన్ని ఫోన్లు విధిగా యూఎస్‌బీ టైప్–సీ పోర్ట్‌ను కలిగిఉండాలని యూరోపియన్ చట్టాలు పేర్కొనడంతో యాపిల్ ఈ నిర్ణయం తీసుకుందని టెక్ నిపుణులు చెబుతున్నారు. ఇక ఐఓఎస్ యూజర్లను థర్డ్ పార్టీ యాప్ స్టోర్ల నుంచి యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకునేందుకు యాపిల్ అనుమతిస్తోంది. దీంతో ఆండ్రాయిడ్ యూజర్ల ఎప్పటినుంచో ఆస్వాదిస్తున్న వెసులుబాటు యాపిల్ యూజర్లకు అందుబాటులోకి రానుంది.

ఇక మరో భారీ అప్‌డేట్, కీలక మార్పు విషయానికి వస్తే ఐఫోన్ 15 ప్రొ వేరియంట్లు ఐఫోన్ 14 ప్రొ మోడల్స్‌లో కనిపించిన న్యూ డైనమిక్ ఐలండ్ ఫీచర్‌తో రానున్నాయి. స్టాండర్డ్ ఐఫోన్ 15 మోడల్ కూడా ఈ ఫీచర్‌తో అందుబాటులోకి వస్తుందని చెబుతున్నారు. దీంతో పలు ఆండ్రాయిడ్ ఫోన్లలో చూస్తున్న టిపికల్ పంచ్ హోల్ డిస్‌ప్లే డిజైన్‌తో నెక్ట్స్ జనరేషన్ ఐఫోన్స్ రానున్నాయని టెక్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

# పనిచేసే వారికే గెలిపించండి రేగులపాటి హరి చరణ్‌రావు




రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 18: (నేటినిజం ప్రతినిధి): సెస్ ఎన్నికల ప్రచారంలో భాగంగా అర్బన్ మండలంలోని కొదుముంజ బిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థి హరి చరణ్ రావు ప్రచారం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూప్రజాలనుండి అనూహ్య స్పందన కనిపిస్తుందని భారీ మెజారిటీతో తమ గెలుపు తథ్యమనిఅన్నారు. గతంలో తను సెస్ లో నేను చేసిన అభివృద్ధి చూసి ప్రజలు ఓటు వేయాలని అన్నారు. అర్బన్ మండలంలో సెస్ లోని నెలకొన్న సమస్యలు పరిష్కారం కావాలంటే బిఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ప్రచారంలో ఆయన వెంట జడ్పిటిసి రవి, ఎంపీపీ బూర వజ్రమ్మ బాబు, వైస్ ఎంపీపీ ఆర్ సి రావు,, అనుపురం సర్పంచ్ వెంకటరమణారావు, బి టిఆర్ఎస్ కార్యకర్తలు ఉన్నారు.

# విద్యార్థి లోకానికి నూతన శకాన్ని అందించినటువంటి గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్




కరీంనగర్, డిసెంబర్ 18(నేటినిజం ప్రతినిధి): స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ విద్యాసంస్థల కేంద్ర కార్యాలయంలో వేడకగా నిర్వహింపబడిన అమాట్ ద్వితీయ దశ నిర్వాహణకు ముఖ్య అతిధిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రారంభానికి ముందు వారు ప్రాంగణంలో ఏర్పాటు చేసినటువంటి శ్రీనివాస రామానుజన్ చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించి విద్యార్థుల సమక్షంలో ప్రశ్నపత్రాలను విడుదల చేసి మార్గదర్శకాలను తెలియజేశారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్ బాల్య దశనుండే గణిత శాస్త్రం పట్ల ప్రత్యేక అభిమానాన్ని పెంచుకొని, అందులో అద్భుతాలు సృష్టించారని కొనియాడారు. రామానుజన్ గారి మార్గదర్శకాలు నేటికి పలుదేశాలలో అమలులో ఉన్నాయని మరియు ఎన్నో లాభాలు పొందుతున్నారని చెప్పారు.

ప్రస్తుత పోటీ ప్రపంచంలో రామానుజన్ నిర్దేశించిన మార్గదర్శకాలను పాటించినట్లైతే అద్భుతాలు సృష్టించిడమే కాకుండా ఇతరులకు ఆదర్శనీయంగా ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. అనారోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా గణిత శాస్త్రం పట్ల అమిత ఆసక్తిని ప్రదర్శించి ఇతరులకు స్ఫూర్తిదాయకంగా ఉన్నారని గుర్తుచేస్తూ వారి సేవలను స్మరించికుంటూ ప్రతి సంవత్సరంలాగే ఈ సంవత్సరం కూడా అమాటు నిర్వహించామని తెలుపుతూ మొదటి దశకు రాష్ట్ర వ్యాప్తంగా అనూహ్య స్పందన లభించినదని 12423 మంది విద్యార్థులు హాజరైనారని ఇందులో 1267 మంది విద్యార్థులు రెండవ దశకు ఎంపికైనారని వారికి నేడు ప్రాంగణంలో రెండవ దశను నిర్వహించడం జరిగినదని చెప్పారు.ఈ రెండవ దశలో ప్రతి తరగతి (6వ 10వ) నుండి మొదటి 20 స్థానాలలో ఉన్న విద్యార్థులకు ప్రశంస పత్రాలను అందజేయడం జరుగుతుందని మరియు ప్రథమ, ద్వితీయ మరియు తృతీయ స్థానాలను కైవసం చేసుకున్న విద్యార్థులకు నగదు పారితోషికాలతోపాటు ఉపకారవేతనాలనుఅందజేయడం జరుగుతుందని చెప్పారు. వీరందరికి ఈ నెల 22వ తేదీన కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో పాఠశాలలో అతిధులచేతులమీదుగా ఘనంగా సన్మానించడం జరుగుతుంది అన్నారు. పరీక్ష విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్స్, టీచర్స్, తల్లిదండ్రులు పాల్గొని హర్షం వ్యక్తం చేశారు.

# పనిచేసే వారికే పట్టం కట్టండి

**– బిజెపి అభ్యర్థి అల్లాడి రమేష్**



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 18: (నేటినిజం ప్రతినిధి): సెస్ ఎన్నికల ప్రచారంలో భాగంగా చందుర్తి మండలంలోని పలు గ్రామాల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థి అల్లాడి రమేష్ ప్రచారం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ"ప్రజాలనుండి అనూహ్య స్పందన కనిపిస్తుందని భారీ మెజారిటీతో తమ గెలుపు తథ్యమని" అన్నారు.

పనిచేసే వారికే పట్టం కట్టాలని, ప్రజలు ఇబ్బందుల్లో ఉంది ఫోన్ చేసినపుడు కనీసం ఫోన్ కూడా లిఫ్ట్ చేసి మాట్లాడలేని నాయకులకు ఓటు అడిగే హక్కు లేదని అన్నారు. నియంతృత్వానికి చరమగీతం పడటానికి సరైన సమయమని, మీ ఓటు ద్వారా వారికి బుద్ధి చెప్పాలని సూచించారు.

ప్రచారంలో ఆయన వెంట బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ మార్త సత్తయ్య, జిల్లా ఉపాధ్యక్షులు సిరికొండ శ్రీనివాస్, మండల అధ్యక్షులు పొంచెట్టి రాకేష్, చందుర్తి ఉప సర్పంచ్ చిర్రం తిరుపతి తదితరులు ఉన్నారు.

# వ్యాధులు రాకుండా వ్యాక్సిన్ తీసుకోవాలి

హైదరాబాద్, డిసెంబర్ 18: మెదడు వాపు వ్యాధి రాకుండా సంవత్సరం నుంచి 15 ఏండ్ల లోపు పిల్లలు జె.ఈ. వ్యాక్సిన్, మీసిల్స్ అండ్ రుబెల్లా రాకుండా వ్యాక్సిన్ తీసుకోవాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ అన్నారు. డిసెంబర్ 21 నుంచి జనవరి 17 వ తేదీ ( 2023 )వరకు వ్యాక్సిన్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్న నేపథ్యంలో శనివారం గోల్కొండ ఏరియా దవాఖానలో వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.

ఈ సందర్భంగా క్యాంపెయిన్ కోసం రూపొందించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే , నానల్‌నగర్ కార్పొరేటర్ ఎండీ.నసీరుద్దీన్, డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ అనూరాధ, సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహరుల్లా, డిప్యూటీ ఐఓఎస్ అనూరాధలతో కలిసి ఆవిష్కరించారు.

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com